ఆవూరు రోడ్డుమీద లేదు. అయినా అక్కడ బస్సు స్టేజి వుంది. బస్సు ఆగింది.


ఆ రోజుకాక మరునాడు దీపావళి పండుగ. ఆ వూరి ఆడపడుచులందరూ తమతమ పిల్లలతోటి, భర్తలతో బస్సు దిగుతున్నారు.

ఊరు రోడ్డుకు ఆరేడు కిలోమీటర్ల దూరంలో వుంది. అక్కడినుండి ఊళ్ళోకి గుర్రపు బండ్లు నడుస్తాయి. అప్పుడే బస్సుదిగి యశోద తన పాపను ఓ చేతిలో పట్టుకొని బస్సుదిగింది. వెనకాల ఆమె భర్త రెండు చేతుల్లో లగేజీతో దిగాడు. బస్సు కదిలింది.

గుర్రపు బండివాడు "రండమ్మగారు రండి. పోయిన దీపావళికొచ్చిపోతే మళ్ళీ ఈ రోజు గుర్తొచ్చిందా మా ఊరు" అంటూ యశోద భర్త చేతిలోని లగేజీ తాను తీసుకొని తన బండివైపు నడిచాడు.

భార్యాభర్తలిద్దరు నవ్వుతూ అతన్ని అనుసరించి బండెక్కి కూర్చున్నారు. గుర్రం కదిలి పరుగులాంటి నడక సాగించింది.

పాప తల్లి ఒళ్ళో నుండి లేచి వెళ్ళి తండ్రి తొడమీద కూర్చొని నడుస్తున్న, కదులుతున్న గుర్రపు తోకను చూస్తూవుంది. మధ్యమధ్యన ఎడమచేత్తో తన జుట్టును దువ్వుకుంటూ తనలాంటి తోకే గుర్రానికి వుందే అనుకుంటుంది.




"ఇప్పుడే వూళ్ళో వుంటున్నదమ్మగారు."

"గుంటూరులో."

"చాలా దూరమే."

"దూరమే" అంటూ భర్తవైపు చూసింది. అతను ఏం చేస్తాం మన రాత అన్నట్టు చూశాడు.

తల్లి తండ్రి యిద్దరు వొకరినొకరు చూసుకోవడం, చూసి పాప తన నాలుకను బయటకు చాచి కళ్ళను మూస్తూ, తెరుస్తూ వెక్కిరించింది.

"అసలు మనిషి పుట్టి పెరిగిన వూరొదిలితేనే బాగుపడతరు"- రాజయ్య.

"నిజమా?" యశోద.

"అవును యశోదమ్మగారు! ఈ వూరొదిలి యింకే వూరు పోయిన ఈ కష్టానికి కడుపునిండా బువ్వ వుండేది, కంటికి నిద్రుండేది. ఈ వూళ్ళో కరువైనవి." యశోద వింటోంది.

వున్నట్టుండి పాప "అగ్గో-అగ్గో" అంటూ తన చూపుడు వేలుతో తాడిచెట్టు ఎక్కుతున్న వ్యక్తిని చూపిస్తుంది. పాప మాటలు ఎవరూపట్టించుకున్నట్టు లేదు. పాప అటువైపే చూస్తోంది.

రాజయ్య చెపుతూనే వున్నాడు.

"నీ పెండ్లికి ఈ బండి మీదే మట్టాలను తోలుకొచ్చిన గుర్తుందా? అంతకు ముందే పదేండ్లనుండి ఈ బండిని తోలుతున్న."

"రోజు ఓ పది యిరవై దొరకవా?" యశోద.

"అమ్మో యిరవై! ఏదో పండగల పబ్బాలకు తప్పా మిగతా రోజుల్లో పది పన్నెండే. వాటిల్లోనే గుర్రంగడ్డి, మాతిండి, ఈ పనె ఇంత, యిండ్ల మోపం లేదు, కర్తిలేని పని కష్టమే తప్పా-"

"అవును. రోడ్డుమీద చిన్న పాకలో మిరపకాయ బజ్జీలు, పకోడీలు అమ్మిన వెంకయ్య తాత ఈ రోజు భోజన హోటల్ పెట్టాడు, భవంతి కట్టాడు" యశోద.

"అంతెందుకు కల్లు మండవాల పొంటె కారపు శనగలు, చుట్లు అమ్మిన జబ్బార్ ఈయాల్ల లారీలకొద్ది దోసకాయల బేరం చేస్తున్నాడు."

"అక్కడవున్న రాసులు అతనివేనా?" యశోద.

"ఆ రైతుల దగ్గరకొని రాసులు పోసి వుంచుతాడు. బెజవాడ నుండి హైద్రాబాద్ నుండి వొచ్చి లారీలకు లారీలే కొనుక్కు పోతారు. రైతులకు పైసలు గూడ వాళ్ళిచ్చినాకనే యిస్తాడు. మద్యన మంచి గిట్టుబాటే వుంటది."

"నీవు ఏదైనా వ్యాపారం చూడకపోయావా?" అన్నాడు యశోద భర్త కాస్త కదిలి కూర్చుంటు.

వెంటనే యశోద తన భర్త మూతి దగ్గర దోసిలి పట్టింది ఓరగా చూస్తు. ఏమిటన్నట్టు చూశాడు.

"ఏం లేదు. మీరు నోరు విప్పారుకదా ముత్యాలేమన్నా రాలుతాయేమో అని-" అంటూ నవ్వింది.

"ఛల్" అంటూ భార్య నెత్తిమీద సుతారంగా కొట్టాడు. అది చూసిన పాప లేచి మూతి బిగిస్తూ తండ్రిని కొట్టి తల్లి ఒళ్ళోకెళ్ళి కూర్చుంది.

"పరే మళ్ళీ నాదగ్గరకి రావొద్దు. అమ్మదగ్గరే వుండాలి" అంటూ బిడ్డను బెదిరించాడు. తల్లి మెడ చుట్టూ చేతులు వేసి తన ముఖం మీదికి తల్లి ముఖాన్ని వొంచుకొంది పాప.

"నేను బేరం చేద్దామనే చూసిన సారు"

"ఏం బేరం?"

"పాయిల కట్టెలు. ఈ కనిపించే కంప చెట్లను కొట్టిచ్చి, చెరిగిచ్చి లారీలు నింపాలి. కాస్తో కూస్తో గిట్టుబాటు అయితదిగానీ మొదలు కొట్టేటోల్లకు కూల్లు కావాలే. వాళ్ళు ఒక్కరోజు ఆగరు. కట్టెలేమో ఎంటనే అమ్ముడుపోవు. ఊరూరా యినేనాయే-"

"అవునుగానీ రాజయ్యా రాధ వొచ్చిందా?"

"ఏ రాధమ్మగారు...రామయ్య పటేలు బిడ్డా-"

"ఆ!"

"వొచ్చింది. విన్నవే వొచ్చింది. నేనే నా బండి మీదనే తీసుకపోయిన."

"వొక్కటే వొచ్చిందా?"

"ఆ! ఆ! పిల్లలేదు, జెల్లలేదు. ఒక్కటే వొచ్చింద. పెనిమిటి గూడ రాలేదు."

మా ఆయన చూడు. నవ్వొదలడు అన్నట్టు తన భర్తవైపు చూసింది. ఆయనేమో బాటకిరువైపులకున్న చెట్లను చూస్తున్నాడు. పాప మాత్రం గుర్రంపు తోకనే చూస్తుంద.

యశోదకు చిన్నప్పటి జీవితం కళ్ళముందు కొచ్చింది.

** ** **

ఆ రోజుల్లో వాళ్ళ వూళ్ళో నాలుగవ తరగతి వరకే వుండేది. అంతవరకే చదివి వూర్కొంది రాధ. తాను పట్టణంలో వున్న తన మేనమామ దగ్గరికి పోవటంవల్ల కాస్త ఎక్కువ చదవగలిగింది. ఎక్కువగా



కలిసి తిరిగే వాళ్ళు, తెలవు రోజున రేగుపళ్ళు ఏరుకోవ డానికి, బావి దగ్గర బంతిపూలు తెచ్చుకోవటానికి కలిసి వెళ్ళేవాళ్ళు. బతుకమ్మలను తీర్చుకోవటం అంటే భలే సరదాగా వుండేది.

ఈలోపున గుర్రం బండి యశోద వాళ్ళ తల్లిగారింటి ముందాగింది. యశోద వెల్లెలొచ్చి పాపనందుకొంది. బండి దిగి యిద్దరూ యింట్లోకి నడిచారు.

"ఆ రాజయ్య ఎంతివ్వమంటావు" యశోద తండ్రి.

రాజయ్య బండిదిగి ఎదురుపోయి "ఎన్నడైనా నేను అడిగిన్నా సాహుకారె తమరెంతిస్తే అంతే" అంటూ చేయి చాపాడు. ఓ రెండు రూపాయిల కాగితం రాజయ్య చేతిలో వాలింది. బండి కదిలింది.

** ** **

సాయంత్రం సూర్యుడు పడమట మునిగిపోతున్నాడు. యశోద తన పాపను నడిపిచ్చుకుంటూ తన వూరి గూర్చి, ఆ వూరి వీథుల్లో కనిపించే బండ్ల గూర్చి, అటు ఇటు తిరిగే మేకల గూర్చి చెప్పతూ నడిపిస్తుంది. అక్కడక్కడ ముడుచుకొని పడుకున్న కుక్కల్ని చూసినపుడు మాత్రం పాప తల్లి చేయిని వొదిలి కాళ్ళ నడుమ నక్కిపోతుంది.


రాధ వాళ్లది పెద్ద భవంతి. చుట్టూ ప్రహరీ గోడ, దానికో పెద్ద దర్వాజ, దాన్ని దాటి లోపలికి పోయింది యశోద, చుట్టూ చూస్తు" అమ్మా! యిది ఎవరిల్లు?" వచ్చీరాని మాటలతో.

"ఇదా...నా ఫ్రెండ్ ఇల్లు."

"ఆ! ఈ వూళ్లగూడ నీ ఫ్రెండున్నదా?"

"ఆ! వున్నది. అదిగో ఆ వరండాలో ఆ బంతిపూల రాసి ముందు కూర్చొని పూలు కుడుతుంది చూడు ఆమె."

బంతిపూలను తోరణాల కోసం దారానికి గుచ్చుతూ ఆ పనిలో మునిగిన రాధ అనుకోకుండా బయటి దర్వాజ వైపు చూసింది. అంతే-చేతిలో దారం వున్న సూది,


రచయిత: బోయ జంగయ్య

దానికి ఎదురుగా మరో చేతిలో బంతిపూవు, ఒక్క క్షణం అలాగే వుండిపోయి, వాటిని కిందేసి "యశు" అంటూ లేచి ఎదురెళ్ళి కౌగిలించుకుంది, బుగ్గను గిల్లింది రాధ. నుదుటిమీద మునివేళ్ళతో కొట్టింది యశోద. జడబట్టి లాగింది రాధ. కొంగుపట్టి గుంజింది యశోద. బిత్తరపోయి చూస్తుంది పాప. సుతారంగా కొట్టుకున్నారు.

మనసారా నవ్వుకున్నారు.

చెదరిన వెంట్రుకలను సవరించుకుంటూ, జారిన కొంగులను సర్దుకుంటు-

"ఎప్పుడొచ్చావే రాధా!"

"నిన్న."

"నీవు?"

"ఈరోజు ఉదయం."

"మరి మీ..."

"వొచ్చారు...మరి..."

'వొస్తారు."

"ఈ జన్మలో చూపిస్తావా?"

"రాధ చూపులు ఎదురుగా బిత్తరపోయి చూస్తున్న పాపమీద నిలిచినవి.

"మమ్మి" అర్థంకాని చూపు.

"ఆ! ఆంటీకి నమస్తే చెప్పు"

"అదేంటే అత్తయ్య అనలేవూ?"

"ఆంటీ అంటే గూడ అత్తయ్యే!"

"ఏదీ అనను అన్నట్టుగా ఓ బెట్టుసరిని ప్రదర్శిస్తూ తల్లిని అతుక్కుపోయింది పాప.

"రావే రా!" అంటూ లాగింది రాధ పాపను.

"హు" అంటూ గునిసింది పాప.

"అమ్మ బుద్ధులా."

"కాదు తండ్రివే."

"అంటే మా అన్నయ్య అంత."

"అని నేననటం లేదు తల్లీ."

"వొచ్చారుగా!"

"రాకుండా ......వుంటాడా-

మనం లేకుంటే మనోనిపని"

రాధ నవ్వి పాప చేయి పట్టుకొని పూల రాసి వైపు తీసుకెళ్ళి బుల్లి పీటమీద కూర్చోబెట్టింది.

"అత్తయ్య లేదా?"

"వుంది. గారెలు, బూరెలు చేస్తోంది."

"ఏ యింట్లో చూడు అవే! తినలేక వస్తున్నామె."

"ఏదో వూరోళ్ళం, అవి తప్ప మేం ఇంకేం చేసుకోగలం. మీరంటే రకరకాలు తయారు చేసుకుంటారు."

"మామయ్యలేడే? మీ వదిన వాళ్ళ తల్లిగారింటికి వెళ్ళిందా?"


"వొదిన, బిడ్డ వెళ్ళిపోయారు. వాళ్ళ వెనకాలే అన్నయ్య వెళ్ళాడు."


"మరి నీ వెనకాల-"

"వొస్తున్నారు."


"సంక్రాంతికా?"

"కాదు- దీపావళికే."



# దీపావళీ! వేగ రా!



చీకటి రాత్రి రక్కసుని చిందు పసందులు నందు గొందులన్
ప్రాకటమై చెలంగి వెలువారగ జూచిన నిస్సహాయులౌ
లోకులు, వేగ వెల్గుల విరోధి వధింతు వటంచు యెంచి నీ
రాకకు వేచినార లవురా! పటు తేజము జూప వేగ రా!

*** *** ***

మాసిన నల్ల మబ్బు తెర మాదిరి భూమికి, నాకసానికిన్
నేసిన చీకటిన్ తొలగ నేర్చిన జాణ, జనాళి మానసా
కాసపు వీథిలోన తొలు కాడెడు బాధల వోలు చీకటిన్
దోసిట దూసి దోహలపు దొంతర కూర్తువు గాని వేగ రా!

*** *** ***

సంతత మంతరంగమును శాంతిని కూర్చెడు మేటి వెల్గు! అ
శ్రాంతము గుండెకోన మనజాలెడు మాయని మంచి వెల్గు! మా
కింత యొసంగు చాలు! ఫలమేమిటి కల్గిన కాంతిపుంజ మ
త్యంత మనంత మంతకము! తాకిన కాల్చు గుణమ్ము కల్గినన్!

—జోస్యము విద్యాసాగర్

"ఏమో అమ్మా!"

"ఆయనకి ఎన్నిపనులు...వ్యవసాయం, వ్యాపారం."

"కోళ్ళఫారం లేదా?"

"అదేమిటి?"

"అది ఓ వ్యాపారమే. ఒక్కరోజు వాటిని చూడ కుంటే వంద. మరునాడు రెండొందలు-ఫినిష్."

"అదేం లేదులే. వాస్తారు."

పాప బంతిపూల రాసిమీద పడి పువ్వులన్నింటిని పట్టి చూస్తు మధ్య మధ్యన ఓ పూవును తీసుకొని తలలో తురుముకుంటుంది. కానీ అవి నిలువలేక రాలిపోతున్నవి.

"నీ బిడ్డ ఎంత అందంగుందే. చిన్నప్పుడు దీని చెంపలు లావుగా వుండేవి యిప్పుడు కొంచెం తగ్గి ముద్దొస్తూవుంది."

"పాల బుగ్గలు అంటే, పెరుగుతువుంటే అ... యింతకు నీకు..." అంటూ యశోద రాధ కళ్ళల్లోకి చూసింది.

రాధ నవ్వింది.

యశోద నవ్వలేదు, ఆలోచిస్తోంది. పాప పువ్వులను ఏరుతూనే వుంది.

"ఏమిటే అలా చూస్తున్నావు" రాధ.

అయినా యశోద చూస్తూనే వుంది. రాధ చిన్నప్పటి నుండి చాలా హుషారుగా. ఎంతో ఆరోగ్యంగా, కిలకిల నవ్వుతూ వుండేది. ఇప్పుడు ఆరోగ్యంగా వున్నా! ఆ నవ్వు లేదు, ఆ హుషారు లేదు. తనకు పిల్లలు లేరని బాధ ఆమె ముఖంనిండా. ఐదున్నర అడుగుల పైనే ఎత్తు రాధది. రాగి, బంగారం కలపోసిన రంగు. అజంతా సుందర్ని అచ్చుపోసి తీసిన విగ్రహం. కాటుక పెట్టక పోయినా కనుగుడ్ల చుట్టూ నల్లని కనురెప్పలు, పై పెదవిపైన, కుడి బుగ్గకింది భాగాన పెట్టినట్టే నల్లని పుట్టుమచ్చ.

"చూడు రాధ. ఆలస్యమైనా ఫర్వాలేదు. నీకు నీలాంటి బిడ్డ పుట్టాలి."

"అంటే?"

"ఏం లేదు. ఈసారి మనకు కొడుకు తప్పదు. ఆ తర్వాత నీకు బిడ్డ పుడితే వానికి చేసుకుంటా" సీరియస్‌గానే అన్నట్టు అనిపించింధి.

రాధ యశోద కడుపువైపు చూస్తూ "మళ్ళీ అప్పుడే" అంటూ నవ్వే రాధ నవ్వుతో యశోద తన నవ్వు కలిపింది.

ఎందుకు నవ్వుతున్నారో తెలుసుకోలేని పాప యిద్దర్నీ పూలతో కొడుతోంది. అప్పుడు పాప ముఖంలో ఎంత నిష్టూరం?

"వీా ఆయన్ని తీసుకురాలేదే?"

"అబ్బా! వొచ్చినోళ్ళకు పెద్ద మర్యాద చేసినట్టు" దెప్పి పొడిచేటప్పటి కదలికతో "అరె, అవునే అమ్మా... ఓ అమ్మా-యిను వొచ్చిందే" అంటూ లోనికి పోబోయే రాధతో-

"చూడే ఈ చిన్ని కడుపులో యింకేమీ పట్టవు. నీవు ఏం ప్రయత్నం చేయకు. నిన్ను చూస్తే అన్నీ తిన్నట్టేనే."


"అ" అంటూ కుడిచేతి వేళ్ళతో నోటిని మూసుకుని ఎడమ చేత్తో కుడిచేయి మోచేతిని పట్టుకుని వింతగా కనుగుడ్లను తిప్పుతూ చూసింది.

"అమ్మగారు ఈ మామిడాకులు యిక్కడ పెట్టనా?" అంటూ తాను మోసుకొచ్చిన మామిడాకు గోనె సంచిని దించాడు పసులకాసే జీతగాడు.

"రావే యిను వంటింట్లోకి పోదాం. అమ్మ యిప్పట్లో బయటికి రాదు" అంటూ అక్కడినుండి కదిలారు.

"వాళ్ళు తనను రమ్మనకుండానే పోవడం గ్రహించిన పాప మూతిని గుండ్రంగా చేసి "హా నేను స్తాను" అంటు పువ్వులను ఎందర వందరచేసి విసురుతుంది. అది గమనించిన రాధ వెనక్కు మళ్ళి "ఓ తల్లీ రావే, నీకు బూరెలు తినిపిస్తా" అంటూ ఎత్తుకుని బుగ్గపై ముద్దాడి కడుపుపై వేళ్ళతో రాస్తు "కడుపు ఖాళీగా వున్నట్టుందే అమ్మమ్మ ఏం తినిపివ్వలేదా?"

"ఎందుకు తినిపించలేదు? పొద్దుటినుండి ఒకటే తిండి" అంటూ లోనికి నడిచారు.



(2)

రాధ అత్తగారి వూరు పెద్ద వూరే. ఆ వూళ్లో రకరకాల వృత్తుల వాళ్లు నివసిస్తున్నారు. వాళ్లలో సీతయ్య పటేలు ఒకడు. ఆయన భూమి ఊరికే ఆనుకొని ఉంది. ఊరికి దూరాన రేగడి కొంత వుంది. మొత్తానికి ఆ ఊరికి ఆయనే పెద్ద భూస్వామి. ఊరు ప్రక్కనే వున్న ఊరబావి ఆయనదే. అది చాలా పెద్ద బావి. దానికి ఆనుకుని ఓ పెద్ద రావి చెట్టు. చెట్టు మొదట మైసమ్మ గుడి. ఆ బావి పదెకరాలను పారిస్తువుంది. వేసవిలో ఆ వూరు జనం త్రాగడానికి ఆ బావినీరే తీసుకెళ్లతారు. ఆ బావి ఎండిపోయినట్టు దాఖలాలు ఏమి లేవు. బావికి పడమర పొలం, తూర్పున దొడ్లు, దొడ్లను ఆనుకొని గడ్డి వాములు, చొప్పకొటార్లు. ఆ తరువాత పశువుల కొట్టాలు ఉన్నాయి. మొదట ఆవూళ్లో బావికి ఆయిల్ ఇంజన్ తెచ్చింది సీతయ్య పటేలే. ఆ తరువాత బావికి ముందుగ కరెంటు మోటారు పెట్టించింది గూడ ఆయనే. పుల్లు పండించేది ఆయనే. ఆ కాలంలో ఎంత వరకు చదువుకున్నాడో తెలియదు. కానీ జీవితాన్ని కాలాన్ని బాగా చదివిన వ్యక్తి. అంతేకాదు అవసరాన్ని బట్టి భారత భాగవతాల్లో నుండి తగు రీతిన ఉదాహరణలిస్తూ ఎంతటి జటిల సమస్యనైనా ఇట్టే తేల్చేస్తాడు. ఊళ్లో వాళ్ళందర్కీ ఆయనంటే ఓ సదభిప్రాయం వుంది. దాదాపు ఎనభై ఏండ్లు పై బడ్డప్పటికీ ఆయనలో అంత వయస్సు కన్పించదు. మనిషి సన్నగా గట్టిగా ఉంటాడు. రోజూ ఇంటినుండి బావి దగ్గరికి నడిచే వస్తూ పోతూ ఉంటాడు.

ఒక రోజు సాయంత్రము బావి దగ్గరి కుప్ప ముందు నులక మంచం మీద కూర్చొని వున్న సీతయ్య పటేలుకు ఆయన కుమారుడు పాండయ్య పొగ చుట్ట చుట్టి తంపడిస్తూ నిలుచున్నాడు.

మూడు పదులు నిండిన పాండయ్యమంచి ఆజాను బాహు. ఆరోగ్యవంతుడు. అప్పటి ఏడవ తరగతి వరకు చదువుకున్న ఆయనకు కాస్త ఇంగ్లీషు కూడా తెలుసు కానీ మాట్లాడలేదు.

"రేపు -పొగాకు లారీ నింపుకొని గుంటూర్కు పొయ్యొస్త"

"ధర ఉందంటనా?" సీతయ్య

ఉండకపోద్దా — రోజులు గడిస్తే ఇంకా తగ్గొచ్చు"

"గట్టు జాతర అయినంక పోతే బాగుంటదేమో"

పాండయ్య చప్పుడు చేయలేదు.

"ఏం లేదు— కోడలి పిల్లను దేవుని దగ్గరకు తీసుకెళ్లి ఇంటి దీపారాధన చేయించి, ఓ రోజు నిద్ర చేయిస్తే దాని కడుపున ఓ కాయ కాస్తే సూడాలని వుంది. నా కాలము కావొస్తుంది. ఊరు పొమ్మంటుంది కాదు రమ్మంటుంది."

"దానికి పిల్లలు పుడతారన్న నమ్మకం నాకు లేదు. గట్టుకుపోవాలంటే దాన్నే వెళ్లి రమ్మను"

"ఇద్దరుపోతేనే పుణ్యముంటుందని"

'ఏం పుణ్యమో ఏం పాపమో — పిల్లలు అయ్యేది వుంటే ఒక్కరు పోయిన అవుతారు. యిద్దరు పోయిన అవుతారు. పనిడిచిపెట్టి నేను పోలేను. ఆమెనే పొయ్యి




చిత్రం: యస్. పావన్

రమ్మను" అంతలోనే గట్టి కొటారులనుండి అంబో తును తరుముకొస్తూ సీతయ్య జీతగాడు. ముందు అంబోతు ఆ వెనక జీతగాడు. అది చూసిన సీతయ్య పటేలు "ఎందుకురా దాన్ని అట్లా తరిమి తరిమి కొడుతున్నవ్, మేయనీయరాదు".

"మేయడమా ఇంకేమన్నవా, మేసేది మేసిపోతే బాగనేవుండు, పొద్దున లేస్తే ఆవుల్లనే ఉంటది"

"కోడే ఆవులల్ల ఉండకపోతే యింకెక్కడ వుంటుం దిరా చిత్రంగా చెపుతవ్"

"ఉండేదేదో మంచి గుంటే బాగుండు. అన్నిటిని పొడుస్తూ దేన్ని మేయనియ్యదు"

"ఆవుల కేసిన గడ్డంత మేస్తది. కొట్టు దాన్ని అవతలకి కొట్టు" పాండయ్య

"మాదగ్గర దేవుడిచ్చిన గడ్డి దేవుని కోడె మేస్తే మేయనీ. గడ్డి మేసిందే చూస్తిరిగానీ, దాని వల్ల మన దొడ్లల్లో ఎన్ని కోడెలు కలిగినవో చూసింద్రా!"

"నిజమే పొద్దున ఈన్న పుల్లావుకు అచ్చం దీని సుంటి కోడె దూడ పుట్టింది. ఆ వూపిరం ఆ చెవులు అచ్చం యిదే అనుకో."

"నేను పేటకెళ్ళి లారీ మాట్లాడుకొస్త" అంటు పాండయ్యతన సైకిల్మోటారును స్టార్ట్ చేసుకొని

పోయాడు.

ఈ రోజున జీతగాడు దొడ్లోకి వెళ్లి పుల్లావు పెట్టిన కోడె దూడను ఎత్తుకొచ్చి సీతయ్య ముందుంచాడు.

"అవునేమిర అచ్చం అట్లనే వుందిరా! అందుకేర్రా నేను అనేది, దాని వల్ల మనకు లాభమేర" అంటూ దూడను నిమిరాడు. అది సరిగ్గా నిలుచోలేక పోతూంది.

"పెద్దగయితే బండికక్కరొస్తది. రేపో మాపో క్రావు ఈనుతది. అది కోడెను పెట్టినా రెండు ఒక్క జోడి!"

"తీసుకెళ్ళు తల్లి దగ్గర ఒదులు. ఆవు పాలు పిండుకెళ్లి పటేలమ్మకివ్వు. జున్ను కాసుద్ది"

రంగయ్య దూడను ఎత్తుకొని దొడ్ల వైపునడిచాడు. సీతయ్య లేచి ఇంటి వైపు నడిచాడు.

చీకటి పడింది.

సీతయ్య గారిల్లు పెద్ద భవంతి. ముందు పెద్ద వరండా. దాని పక్కనే వెనక వున్న వంటగది వరకు పోయే మరో దిడ్డి దర్వాజా. దిడ్డి దర్వాజా దాటగానే పెద్ద ఖాళీ స్థలం. అందులో పిడకల గూడు. పొయ్యిల కట్టెలు పేర్చి వున్నాయి.

"పటేలమ్మా"

"ఎవరు" ఇంట్లో నుండి ఆ యింటికోడలు రాధమ్మ.

"రంగన్ని"

"వొస్తున్నా" వరుసగా వున్న దర్వాజాలను దాటు తూ వస్తూ వుంటే సన్నగ మొదలైన మెట్టెల చప్పుడు రాను రాను మరింతై వాకిట్లో ఆగినవి. తడిచేతులను కొంగుకు తుడుచుకుంటు రావడం వల్ల గాజులు కాస్త సందడి చేస్తున్నవి.

"పల్లావు ఈన్నది" అంటూ పాలచెంబును ఆమెకు అందించడానికి ప్రయత్నిస్తూ.

"ఎప్పుడ్రా" కొంగును నోటికి చెక్కుతూ

"ఈయాల్ల అమ్మటాలప్పుడు"

"ఏం దూడ"

"తమరు ఈ యింట్ల అడుగు పెట్టిన్నుండి కోడెలే కోడెలు"

"తమరి తల్లిగారిచ్చిన క్రావు గూడ రేపోమాపో యీనుద్ది. అది గూడ కోడెను పెట్టినా యిగనూడు రెండింటిని బండి కట్టొచ్చు" అంటూ రంగడు బావి వైపు, రాధమ్మ యింట్లోకి నడిచారు.

మరునాడు వుదయం బయటి నుండి యింట్లోకి వస్తూనే—

"అమ్మాయి రాధ కచ్చడం సిద్ధమౌతుంది". సీతయ్య పటేలు కోడల్ని పిలిచి చెప్పాడు.

"ఆయన పొద్దున్నే గుంటూరు పోయిండ్రు"

"నాకు తెలుసు లేవమ్మా, వాడు రాడు. నీవేపోయి ఆ దేవునికి దీపారాధన చేసిరా"

"అట్లాగే ఓ ఆవు—దూడను తీసుకుపోయి ఆ దేవుని మెట్లదగ్గర కట్టేసిరా. రంగనికి చెప్పిన. వాటిని కూడ కచ్చడం వెనుక కట్టుకొస్తాడు."

రాధమ్మ మాట్లాడలేదు. ఆమె ఆలోచనలు చాలా లోతుల్లోకి వెళ్లాయి. తన కడుపు పండనందుకు చూప

గారికి ఎంతో ఋదిగా వున్న సంగతి గ్రహించింది. తన భర్త తనను ఎందుకు గుర్తించడో మాత్రం ఊహించ లేకపోతూంది. పెళ్ళయిన కొత్తలో చాలా మంచిగ చూసేవాడు. రాను రాను తన గూర్చిన ఆలోచనే మర్చిపోయాడు. అనుకుంటూ మౌనంగా నిలిచి వున్న రాధ కళ్లలోని నీళ్లు రెప్పలను తన్నుకొని బుగ్గలను దాటి పడుతున్నాయి. ఆమె చేతిలో చీరకొంగు దారాలు వేరు వేరై పోతున్నాయి.

"ఎన్నో దేవుళ్లకు మొక్కగా మొక్కగా వాడు పుట్టింది, వాడికేమి తెలుసు. వాడు నిన్న మరో పెళ్లి చేసుకుంటా నంటేనే నాగుండె లవిసిపోయినవి. ధాన్యం, ధనము, దొడ్లు, పశులు ఎన్ని వుంటే అంత మంచిదే. వాటి వల్ల ధైర్యం పెరుగుద్ది. గౌరవ మరియా దలు పెరుగుతవి. కానీ ఒక్క పెళ్లం కంటే ఎక్కువ వుంటే మనిషి విలువ తరుగుద్దని మరీ మరీ చెప్పాను."

రాధ ఏడుస్తూనే నిల్చుంది. పాతికేళ్ల వయసు ఆమె ప్రతి అణువులో కనిపిస్తు వుంది. ఏడుస్తువున్న కోడలిని చూస్తు వున్న సీతయ్య కనులు చెమర్చాయి.

"నీ అత్త వుంటే బాగుండేదమ్మా. నేను ఎన్నడు చేసిన పాపమో ఆమె నాకు దూరమై ఈ ఆస్తి అంతా ఆమె పెంచిందే" తన భార్య గుర్తుకు రాగానే సీతయ్య ముఖంలో మార్పువొచ్చింది.

"దొర కవ్వడం తయ్యార్" రంగడు వాకిట్లోనుండి కేకేసాడు.

"అన్ని సర్దుకుని వెళ్ళి, ఓ పూట నిద్రచేసి వస్తే బాగుంటుంది" అంటూ తాను వాకిట్లోకి నడిచాడు.

③

కవ్వడం బండ్ల బాటన నడుస్తు వుంది. బాటకిరు ప్రక్కల బాగా పెరిగిన కామంచగడ్డి, చెల్లమీద పక్షుల చప్పుడు, నీలి ఆకాశాన ఎగిరిపోతున్న తెల్లని కొంగల గుంపు, దోవకు అడ్డంగ పరుగెడుతున్న ఉడుతలు.

కవ్వడంలో పరచిన పరుపుమీద రాధ కూర్చొని వుంది. రంగడు కవ్వడాన్ని ఒకే మేరలో నడుపు తున్నాడు. కవ్వడం వెనక తాడుతో కట్టిన తెల్లని ఆవు కవ్వడంతోపాటే నడిచి వస్తోంది. దాని మూడు నెలల కోడెదూడ తల్లివెంబడి నడుస్తు మధ్య మధ్యన గంతులు వేస్తూ నడుస్తోంది.

"రంగడూ! ఆ కోడె దూడను కవ్వడంలో వేసు కుంటే? చిన్న ప్రాణం నడవలేకపోతుంది."

"ఆ అది అంతే దాన్ని పట్టుకున్నా ఆగదు."

రాధ దూడవైపు చూస్తూ వుంది. కాటుక పెట్టిన కళ్ళు చిన్న వూపిరం. కుంచెలాంటి తోక ఎంత బావుం దని!" అని అనుకుంది.

"ఈ లేగదూడ కూడా ఆ అంబోతుకే పుట్టిం దట్రా."

"అ, కానీ దీని తల్లి కొంచెం పొట్టిరకం. ఇది కూడా పొట్టిరకమే అయ్యేటట్టుంది."

కమిశ కర్రను గదమకింద పెట్టుకుని వెనుక వస్తున్న ఆవు దూడను చూస్తూ అన్నాడు. రంగడు తన చూపు లను అనుకోకుండా రాధ మీద నిలిపినాడు. పల్లికిలో పెళ్ళి కూతురులా కూర్చుంది. బంగారు బొమ్మకు పట్టుబట్టలు కట్టించినట్టుంది. పటేలమ్మకు కొడుకో, బిడ్డో పుడితే ఎంతబాగుండు అనుకున్నాడు.

బాటలో రాళ్ళు రప్పలు వుండడంవల్ల కవ్వడం కాస్త



కుదించినట్టు కదులుతూ నడుస్తోంది. రాధ దృష్టి రంగని వైపు మళ్ళింది.

రంగడు బలంగా వున్నాడు. కోరమీసాలు, తెల్లని పలువరస, వాడు తొడుక్కున్న బనియన్ వదలిన దండ రెక్కల కండలు. రాధకు వున్నట్టుండి నవ్వొచ్చింది. వాడు అలా వున్నందుకు కాదు. వాడిని చూడగానే వూళ్ళోని ఆంబోతు గుర్తొచ్చినందుకు.

"రంగ"

"అ"

"పెండ్లెప్పుడు చేసుకుంటావుర!"

రంగడు మౌనంగా నవ్వాడు.

"ఇరువై ఐదేండ్లు లేవు నీకు"

"మా అమ్మ అంటుంది మన వూరి పెద్ద చెరువు తెగిపోయినప్పుడు పుట్టినట. ఉండొచ్చు ఇరువైమూడు, ఇరవై నాలుగు" అంటూ కోడెలను అదిలించాడు.

"అసలు విషయం చెప్పలే".

"పెళ్ళా! పటేలు ఎప్పుడు చేస్తే అప్పుడేచేసుకుంటా"

"అంటే పిల్ల తయారుందన్న మాట" పెదాల

"మరి నేను బక్క పడడం లేదు గదర"

"మీకు కలలు పడతాయా అమ్మగారు" దొరసాని వైపు ఓ మాదిరి సిగ్గుతో చూస్తూ.


"నేను మనిషిని కానా? నాకు మనస్సు లేదా? అసలు కలలు పడడం చాలా మంచిదిర. తీరని కోరికలు అన్నీ కలల్లో కన్పిస్తవి. నాకు రోజు కలలు పడతవి" ముఖంలో తెరలా ఒస్తున్న సిగ్గును కప్పిపుచ్చుకోవడానికి తన గాజులవైపు చూసుకుంటోంది.

"మీకొచ్చే కలలు కాదమకో" ఈ సారి రంగడు ఆమె వైపు చూడక కవ్వడం లాగుతున్న కోడెలవైపు చూస్తున్నాడు.

"అంటే"

"అదే కలల్లో ఆడమనిసి రావద్దట అట్లా వస్తే మొగోడు........"

"ఎవరు చెప్పార్రా" అంటూ రాధ కిలకిలా నవ్వింది. నవ్వువల్ల వచ్చిన కదలికను ఆపుకోవడానికి కాబోలు కవ్వడంలో అమర్చిన మెత్తకు వొర్గి కూర్చుంది. ఆమె నవ్వు చప్పుడుకు లేగదూడ ఆగి అదో మాదిరి చూసి




మీద చిరునవ్వుతో రంగన్నే చూస్తూ.

"నేసుకోవాలే కాని పిల్లలు కరువా——"

రాధ దృష్టి వాని దండరెక్కకున్న తాయిత మీద ఆగింది.

"ఆ తాయిత దేనికిర"

"ఇదా...ఇది...ఇది......" అంటూ తాను దానినె చూసుకుంటున్నాడు.

"అ...అదే దేనికి"

"కలలు పడకుంట"

"తాయిత కట్టుకుంటే కలలు పడవా?"

"పడవు"

"కలలు పడితే ఏమౌద్దిర"

"కలలు పడితే మనిషి బక్కపడిపోతాడట"

గంతులేస్తూ నడవసాగింది.

"నిజంగా ఆ కోయదొర చెప్పాడు. ఈ తాయిత ఒట్టేగియ్యలే ఓ కోడి పుంజును, శేరు బియ్యం"

"ఐదు రూపాయిలు తీసుకొనిచ్చాడు"

"ఆ తవరికెల్ల తెలుసు"

"ఎందుకు తెలువదు. బియ్యం కోడెవున్నాక తాగ డానికి కావద్దు"

"కావచ్చు కానీ దీన్ని కట్టుకుని ఆడోళ్ళను ముట్టు కుంటే చెట్టెక్కుదని గూడ చెప్పిండు"

ఈ సారి చాలాసేపు నవ్వుతూనే వుంది. మూతి కడ్డం పెట్టుకున్న చేతివేళ్ళ సందుల్లో నుండి నవ్వు వరదలా వస్తూ వుంది.

రంగడు కవ్వడాన్నించి లేచి నిలుచుని వెనుక వైపు చూస్తున్నాడు. రాధ నవ్వును ఆపుకుని ఎడమ చేతితో కళ్ళు తుడుచుకుని "ఎంటీ చూస్తున్నావు" కొంగును భుజంనిండా కప్పుకుంటూ.

"లేగదూడ కనిపించడం లేదు"

అప్పటివరకు ముందుకే చూస్తూ నడుస్తున్న ఆవు వెనక్కి తిరిగి చూసి తన దూడ లేదని గ్రహించింది కాబోలు ఒక్కసారే "అంబో" అని అరిసింది. ఆ అరుపు విన్న దూడ గంతులేస్తూ పరుగెత్తుకొస్తుంది. ఆ దృశ్యాన్ని చూస్తున్న రాధ మనస్సు ఏదేదో అనుభూతు ల్లోకి వెళ్ళింది.

నిజంగా తోటలోని పూలు గాలికి ఊగేటప్పుడు, చేప నీటిలో ఈదేటప్పుడు, దూడ గంతులేస్తూ నడిచే టప్పుడు. పసిపాప బోసినోరు విప్పి నవ్వుతు కేరింతలు కొడుతుంటే ఎంతో అందమైన దృశ్యాలు.

రాధకు పేటిల్లోని దృశ్యం ఏదో గుర్తువచ్చినట్టుంది. కళ్ళు మూసుకుని దిండుకు వంగింది.

విప్పకుని మొగ్గల్లో ఏవేవో అందాలు దాగున్నట్టు మూసుకున్న కళ్ళల్లో ఏవేవో తీరని కోరికలు.

రంగడు కూర్చుంటు కమిశ కర్రను విదిలించాడు. కవ్వడం కదిలింది దాని వెంట ఆవు దూడ.

రాధ కదలి కూర్చుంటు టిఫెన్ డబ్బా, మర చెంబును దగ్గరికి తీసుకుని డబ్బా మూత తీసి అందు లోని జున్నును కొంచెం నోట్లో పెట్టుకుని మిగిలిన జున్ను డబ్బాను రంగనికేస్తూ......

"రంగడు జున్ను తినర"

"నాకెందుకు తమరే తినాలట"

"ఎవరన్నారు! మా చిన్న పటేలా?"

"కాదు పెద్ద పటేలు"

"ఎందుకో ఆమాట చిన్న పటేలు అంటే బాగుం డును అనిపించింది. కాని ఆ మనిషి అనదు. తన విషయంలో ఆయన కెందుకో ఓ మాదిరి పట్టింపు లేదు. పెళ్ళైన కొత్తలో ఎంతో ప్రేమగా వుండేవారు. రాను రాను ఎందుకిలా తయారౌతున్నాడో అర్థంకాదు. మావయ్య చెప్పినా వినడు. ఈ పొగాకు పండించకున్న పోయేది. ఆయన పట్టణం పోయేది తగ్గేది. పొగాకు పండించే వాళ్ళందరూ, పట్టణాలకెళ్ళే వాళ్ళందరూ భార్యలను సరిగా చూడడంలేదా? అసలు మనిషికి తాగుడు అలవాటు కావొద్దు తాగిన మనిషి ఏదైనా చేస్తాడు. ఈ మనిషికి తాగుడు అలవాటైనాకనే తనకు దూరంగా వుంటున్నాడు. పోనీ తాగి కూడా భార్యలతో హాయిగా వుండేవాళ్ళు లేరా? ఎప్పుడు వరసగా నెల రోజులు ఇంట్లో వుండక నీకు పిల్లలు కారు, గొడ్రాలివి అంటే నేనేమి చేసేది. ఈ బాధ ఎవరికి చెప్పేది. ఎలా చెప్పేది. పాపం మావయ్యా చాలా మంచివాడు. అన్ని తెలిసిన మహానుభావుడు మామయ్యే లేకపోతే ఆ ఇల్లు ఇట్లా వుండేదా?"

కవ్వడం నడుస్తూనే వుంది. రంగడు ఏదో ఈల పాట పాడుకుంటున్నాడు. ఈలపాట వింటున్న దూడ కవ్వడం ముందుకొచ్చి చెవులు నిక్కపొడిచి వింటూ పరిగెడుతోంది. రాధ తలనిండా ఆలోచనలే! "పిల్లలు పుట్టనంతమాత్రాన ఆడవాళ్ళదే తప్పని ఇట్టే అనేస్తారు.

వాళ్ళది కూడా తప్పంటుందని ఎందుకనుకోరు? మొగ వాడి అన్ని లోపాలను ఆడది కప్పిపెట్టాలి. ఏ లోపము లేకున్నా ఆడదాన్నే వేలెత్తిచూపుతారు వింతమనుషులు'' అనుకుంటూ ఆలోచనల వలయంలో నుండి తేరుకుంటూ చేతిలోని జున్ను గిన్నెను గుర్తుతెచ్చుకుని.

''ఇంకేమన్నదుర పెద్ద దొర''

''నిన్న ఈనిన ఆవుపాలు పిండేటప్పుడు పాలు ఇంట్లో ఇచ్చి జున్ను కాసి మిమ్మలను తినమను అన్నప్పుడే అనుకున్న''

''ఏమని?''

''జున్ను తింటే......''

మాట పూర్తయ్యేలోగా రాధకు సిగ్గు ముంచుకొచ్చింది. జేపురించిన ముఖంతో ఉక్కిరిబిక్కిరై గిన్నెలోని జున్నును తీసి రంగని ఛాతిమీద కొట్టింది.

''అమ్మగోరు'' చేతులను అడ్డంగ పెట్టుకుంటు అరిచాడు.

''లేకపోతేంది అందరూ అదేమాట నేను నేను'' అంటూ మోకాళ్ల మధ్యన తలవానించి మౌనంగా ఏడవసాగింది.

కచ్చడం నడుస్తూనే వుంది.

4

గుడికి కొంచెం దూరంలో కోనేరు, దాని పక్కనే ఓ ధ్వజస్తంభం. పిల్లలు కావలసినవాళ్ళందరు కోనేటిలో మునిగి అక్కడ వున్న చుట్టూర పొర్లుతూ దండాలు పెడుతుంటారు. వాళ్ళకు తప్పక పిల్లలు పుడతారని ఎన్నో ఏండ్ల నుండి వొస్తున్న ఓ నమ్మకం అది.

ఆ నమ్మకాన్నే ఆ వూరి పెద్దలు, అక్కడి పూజార్లు కాపాడుతూ వొస్తున్నారు.

ఆ రోజు మిట్ట మధ్యాహ్నం జనం చాలామందొచ్చారు. కోనేరు నిండా జనమే. ఆడా మగా అందరూ అదే కోనేరులోనే మునుగుతున్నారు.

పిల్లలు కావలసిన ఆడవాళ్ళందరు తెల్లని ఒంటిపొర కోకను ధరించి, కోక రెండవ కొంగుతో పాలభాగాన్ని కప్పకొని కోనేరులో మునిగి వచ్చి అక్కడ వున్న స్తంభం చుట్టూర పడుకొని పొర్లుతూ, బోర్లపడుకొని సాష్టాంగ నమస్కారం చేస్తూ రెండు చేతులు జోడించి తమతమ కోరికలను దేవునికి విన్నవించుకుంటున్నారు.

తెల్లని తడి చీరలో నుండి కనిపించే ఆ స్త్రీల వంపు సొంపులను ఒక్క పూజార్లే కాదు ఎవరైనా చూడొచ్చు. అందుకోసం చాలామంది మగవాళ్ళు కూడా స్తంభానికి నమస్కరిస్తున్నట్లు చేతులు జోడించి నిలుచున్నారు. వాళ్ళ చూపులు మాత్రం స్తంభం మీదలేవు.

ఆ తరువాత పక్కనే వున్న శివుని గుడిలోనికి వెళ్ళి అక్కడ లింగపూజ జరపాలి. అక్కడ కూర్చున్న పూజారి ఒక్కొక్క స్త్రీ రాగానే ఆ నూనె దీపం వెలుతురులో ఆమె నుదుట అడ్డంగా విభూతి రుద్ది శివలింగం దగ్గరి మల్లెపూవులను తీసుకొని ఒకటి నోట్లోపెట్టి, ఓ చేత్తో నోరు మూసి మరో చేత్తో బొడ్డు దగ్గరి చీరెను కిందికి నెట్టి, బొడ్లో ఓ పూవుంచి ''తప్పక నీ కడుపున ఈ పూవు కాయ కాస్తది'' అంటూ తల నుండి మొల వరకు నిమురుతున్నాడు.

గుడిలోకి తొంగి చూస్తున్న రంగడి జబ్బపై చరిచి ఓ పూజారి ''అక్కడున్నది మీ దొరసానేనా'' అన్నాడు.

''ఆ '' అన్నాడు రంగడు పూజారి వైపు చూస్తూ.

''నా సామిరంగ మీా'' దొరసానీ-

''ఆ బంగారంలాంటి కొడుకే పుట్టాలి''

మేలిమి బంగారమైన రవ్వంతైనా రాగి కలిస్తేనే ఒక అందం'' మరగున పడ్డ సత్యాన్ని శాసనం ద్వారా చాటిచెప్పినట్టు చెప్పాడు. ఇంకేదీ వినపడకుండా అంటూ కనుసైగ చేశాడు. అది అర్థం కాని రంగడు మళ్ళీ గుడిలోకి తొంగి చూశాడు. పూజారి ఏమేమో అడుగుతున్నాడు. రంగడు మాత్రం చేతులు జోడించి నిలుచున్నాడు. పూజారి రాధవైపే చూస్తూ చేయి చాపాడు. రాధ అతని చేతిలో కొన్ని రూపాయిలు వుంచుతోంది. ఇది తరతరాల నుండి వొస్తున్న తంతట. భక్తి వున్నవ్నేళ్ళు ఇది బతికి వుండక తప్పదు. గుడిలో నుండి రాధ వొచ్చి ''రంగా నీ వెళ్ళి గోదానం చేయించిరా'' ఇదిగో వాళ్ళకిచ్చే కట్నం అంటూ రంగని చేతిలో కొంత డబ్బుంచింది.

''మంచిది'' అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

పూజార్ల చూపులను తప్పించుకొని కొంచెం పక్కనున్న రాతి గోడ కానుకొని నిలుచొని తనను తాను పరిశీలనగా చూసుకుంది. తడిసిన వొంటిపొర చీరెలో తాను నగ్నంగా వున్నట్టు కనిపించగానే వొళ్ళు జలదరించింది. బరువైన శ్వాసను వొదులుతూ తల పైకెత్తి చూసింది. ఎదురుగా వున్న రాతి గోడకు స్పష్టంగా చెక్కిన శృంగార భంగిమ పడకటింటి దృశ్యం. కోవెలకెందుకు చేరిందా అన్న ఆలోచనలు చుట్టుకున్నాయి రాధకు.

కోనేటికి కొంచెం దూరంలో వున్న వేప చెట్టు కింద కచ్చడాన్ని విడిచి, కోడెలను వేప చెట్టు మొదలకు కట్టేసి కచ్చడంలోని పరుపు క్రింద వున్న గడ్డిని తీసి కోడెల కేశాడు. అవి మేస్తూనే వున్నవి.

''రంగా నీవెళ్ళి ఏమన్నా తినిరార'' అంటూ ఐదు రూపాయిల నోటు రంగనికిచ్చింది.

''మరి తమరు''

''నాకు ఆకలిగా లేదురా.''



గడ్డి మోపులతో పల్లె పడుచులు:

రాజస్థానీ శైలి చిత్రం: భరద్వాజ శాస్త్రి: గిద్దలూరు

''అయితే తమరు కచ్చడంలో కూర్చోండి నేను తినొస్త'' నంటూ దుకాణాల వైపు నడిచాడు.

రాధ తన భర్తను తలుచుకుంటూ ఆయన కూడా వొస్తే ఎంత బాగుండు అనుకుంటూ కచ్చడంలో కూర్చుంది.

ఎవరో చదువుకునే కుర్రాళ్ళట్టుంది రెండు మూడు సార్లు ఎంతో పని వున్నట్లు వచ్చి చూసి వెళ్ళారు.

రాధకు నవ్వొచ్చింది. నవ్వుతూనే చుట్టూ చూసింది. చెట్టుకింద జనం వంటలు చేసుకుంటున్నారు. చిన్నప్పుడు తన తల్లిగారి వూర్లో చెట్ల కిందికి వెళ్ళి ఇలాగే వొండుకునేవాళ్ళు.

పొద్దు పడమరకు వాలింది. వాతావరణం కాస్త చల్లబడింది.

"రంగా అలా వెళ్ళి ఆ దుకాణాలను చూసి వద్దామా"

"పదండి."

రాధ ముందు నడుస్తూ వుంటే రంగడు వెనుక ఆమెను అనుసరిస్తున్నాడు. ఇద్దరూ ఒక్కొక్క దుకాణాన్ని చూస్తూ నడుస్తున్నారు. తినుబండారపు దుకాణాలు, వాటి ఎదురుగా కొంటున్న జనం, వాటి పక్కన గాజుల, మట్టెల దుకాణాలు, కొనిస్తున్న బావలు, తొడిగిచ్చుకుంటున్న మరదళ్ళు, మట్టెలు పెడుతున్న కంచరి, డబ్బులు కడుతున్న భర్తలు, ఇంకా ముందుకు నడువగా రెండవ వైపు కుంకుమ రాసులు, చేతులకు కట్టుకునే రంగు రంగుల దారాల గుత్తులు, దాని పక్కనే వున్న ఖాళీ స్థలంలో క్రిర్ క్రిర్ మనిపిస్తూ గాలి వూదిన రబ్బరు పుగ్గలతో ఒకరు. అతని చుట్టూర అందరూ పిల్లలే! కొనిచ్చే తల్లితండ్రుల విసుగు ముఖాలు, ఇంకొంచెం దూరంలో నిలబెట్టిన డబ్బాలో వైకుంఠాన్ని చూపిస్తూ "బొంబాయి నమునా బి దేఖో" అంటున్నాడు. అక్కడ చాలా జనం మూగి వున్నారు. ఒకరి భుజాన్ని ఒకరు రాసుకుంటున్నారు. ఇదే సందని స్టూడెంట్ కుర్రాళ్ళు పడుచు పిల్లల కాళ్ళు తొక్కుతూ, రాసుకపూసుక తిరుగుతూ, పోలీసోళ్ళు చూసినప్పుడు మాత్రం ఏమి తెలియని బుద్ధిమంతుల్లా తిరుగుతున్నారు. ఆడ పిల్లలూ తిరుగుతున్నారు. కానీ, చాలా జాగ్రత్తగా నడుస్తున్నారు. అక్కడక్కడ కొందరు తప్ప.

నడుస్తున్న రాధ వెనక్కి చూసింది. రంగడు లేడు. వాడింకా వైకుంఠం దగ్గరే నిలుచున్నాడు. ఇంతలో ఎవరో ఒకడు రాధ కాలు తొక్కాడు. అంతే కాదు వెంట ఎవరూ లేరని గమనించి భుజాన్ని కూడా తాకాడు. సరిగ్గా అతనివైపు రాధ చూసేసరికి తప్పుకొని మందిలో కలిశాడు.

ఆమె ముందుకు నడుస్తూ వుంది. ఎదురుగా గుట్ట మీద కెక్కే మెట్లు. అక్కడ అందరూ కుంటి, గుడ్డి, బిక్షగాళ్ళు అడుక్కుతినే అందరు వరసగా కూర్చొని అడుక్కుంటున్నారు. వచ్చే పోయే జనం తమకు తోచినంత వేస్తున్నారు. వాళ్ళందరికి తలా ఓ పావలా ఇస్తూ నిలుచుంది రాధ.

అంతలో రంగడొచ్చాడు. ఇద్దరు కలిసి వెనక్కి మళ్ళి కచ్చడం వైపు నడిచారు. వున్నట్టుండి రంగడు ఆగి జేబులో నుండి ఓ రూపాయి తీసి మూడు ఆకులను చూసి ఓ ఆకు మీదుంచాడు. అంతే ఆకులేసేవాడు వెంటనే ఆకును తిప్పి చూపించి "బొమ్మ మీద పెడితే మీకు, లేకుంటే మాకు" అంటూ రూపాయి తాను తీసుకొని ఆకుల కింద పరచిన బస్త సంచి మడతలో పెట్టేసుకున్నాడు. "హు" అంటూ రంగడు అక్కడి నుంచి కదిలి కొంచెం పక్కనే పది పైసలిచ్చి తూకం చూసుకుంటున్న రాధమ్మను చేరాడు. రాధ అక్కడి నుండి కదులుతూ

"పోయినాయా - వచ్చినాయా" అంటూ నడవ సాగింది.

రంగడు "అంతా మోసం."

"లేం దెక్కడ" అదో మాదిరిగా నవ్వుతూ అంది.

గుట్టకు కొంచెం దూరంలో సమంగా వున్న ప్రదేశంలో ఈ తిరుణాలకు వొచ్చే బస్సులు ఆగడం, జనాన్ని ఎక్కించుకొని అక్కడి నుండి బయలుదేరడం జరుగుతుంది. ఆ తిరునాలు జరిగినన్ని రోజులు అదో ఆర్.టి.సి. వాళ్ళ తాత్కాలిక బస్ స్టేడ్ అన్నమాట. దాని పక్కనే ఓ రావి చెట్టు ఓ చింత చెట్టు వున్నవి. వాటి నీడే అక్కడికొచ్చే కొంత జనానికి ఓ ఊరట. కొంచెం దూరం వెళితే ఓ దిగుడు బావి, దాని చుట్టూరా మామిడి చెట్లు, వాటి కింద జనం వంటలు చేసుకుంటూ వుంటారు.

ఉన్నట్టుండి ఓ పెద్ద ఏడుపు వినిపించింది. రాధమ్మ ఒక్కసారే అటు వైపు చూసి అనుకోకుండా అటు వైపు నడిచింది. రంగడు ఆమెగారి వెనకాలే నడుస్తున్నాడు.

ఆ రావి చెట్టు కింద ఓ బాలుని శవం. శవం పక్కన అతని తండ్రి, నాయనమ్మ నెత్తి, నోరు కొట్టుకుంటూ కూర్చున్నారు.

దేవుని గుడి వైపు మళ్ళి తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతుంది తల్లి.



## శ్రమ జెండా లెగరేస్తూ

నేనొక చెమట చుక్కనే కావచ్చు
కానీ నా రక్తపు పొదుగులు పితికి
నీకు రెండు రెక్కలు తెచ్చిన దాన్ని
కష్టాల అగ్నుల్లో నడిచి
భీకర తుపానుల్లో నిలిచి
ఉదయాస్తమయాల రంగుల నీడల్లో
నా నరాల పొత్తుల్తో నాగరికతా
దీపాల తోరణాలు కట్టినదాన్ని
జయాపజయాల పడవల్లో ప్రయాణంచేస్తూ
అవమానాల రాస్తాలో
గుండె విడిచిన కాలం విసిరిన
కల్లోలపు అలల్ని దాటుకుంటూ
శ్రమ జెండా లెగరేస్తూ
ఆధునిక యంత్ర యుగపు రేవుకు చేరినదాన్ని
నీ మేధస్సు పరిమళాల్ని మేల్కొల్పి
రోదసీ దిశల్లో విదిలించిన దాన్ని
బాధల్తో మూల్గుతున్నదాన్ని
ఆకల్తో మరణిస్తున్నదాన్ని
నీ కోసం
సంతోషంగా మళ్లీ మళ్లీ ఉదయిస్తున్నదాన్ని
ఆకాశం వోదార్పు విడిచి
భూగోళం కన్నీరు తుడిచి
మానవతా పత్రాల్లో
నగ్నంగా నర్తిస్తున్నదాన్ని
నా శ్వాసను
నీ సౌఖ్యం కోసం దానంచేసిన దాన్ని
నాకోసం ఏమీ మిగుల్చుకోనిదాన్ని
నీకు మాత్రం
పైత్యం పెరిగి తల తిరిగి
సామాన్యుల బ్రతుకు పీల్చుకుతింటున్నావ్
కానీ ఇది నిజం
నేడు చేసిన కష్టం
వాడి కడుపు నింపకపోతే
రేపు నిట్టూర్పుల ఒరల్నుంచి
నీ శిరస్సును భక్షించే
మానవతా ఖడ్గాలు పుట్టుకొస్తాయ్.
ఈ మహోన్నత మానవ మేధస్సుకి
సృష్టి సంఘర్షణకి, సంచలనానికి
నేను ఏకైక ప్రతినిధిని
కాలం గుండె చిటిలి చిందిన కాంతిలో
శ్రమ జెండా లేగరేస్తూ
సౌఖ్యాల పూదోటకు చేరుకునేదాన్ని

—ముత్యాల ప్రసాద్

"ఓరి దేవుడా — నీ గుడి గుండం కాను."

"వున్నొక్క కొడుకును తీసుకు పోతివేందరో!"

"నీ గుళ్ళో మన్నుపొయ్యా, నా కడుపునే కొడితి వేరో"

"నీ కేమి తక్కువ చేస్తిరా, దీపారాధన సేయిస్తి గదరో"

"జోడు కొబ్బరి కాయలు కొట్టిస్తి గదరో"

"ఏటేటా ఒక్క పొద్దు పొల్లుపోకుండా వుంటి గదరో"

"ముదుపు కట్టుకొచ్చిన ముల్లె - నీ గల్లలో ఏస్తి గదరో"

"నీ గుళ్ళో దీపం ఆరిపోను. నా బతుకు చీక టాయరో"

నా కన్నకడుపు నంత బొందల గడ్డపాలు చేస్తివి గదరో" అంటూ ఆమె కడుపంతా కొట్టుకుంటుంది. ఆమె కడుపులో పేగులున్నట్టు కనపడడం లేదు. ఆమె కళ్ళల్లో ఊపిరి కొట్టుమిట్టాడుతున్నట్టు అనిపిస్తుంది. ఆమె బతుకంతా బాధలతోనే గడిచినట్టు ఆమె నలభై ఏండ్లు దాటిన ముఖం చెపుతుంది. ఆమె కన్నీ రెప్పుడో యింకిపోయినట్టుంది. ముక్కులో నుండి వొచ్చే తడిని మాత్రం మధ్య మధ్యన వేళ్ళతో తొలగిస్తుంది.

ఎండ వానల్లో రేయింపగలు కష్టించినట్టు అయినా వాళ్ళ పేదరికం పోనట్టు వాళ్ళు ధరించిన వెలిసిన ముతక గుడ్డలు, రక్తం సరిగా లేక నరాలు తేలి నలుపుపారిన శరీరాలే చెపుతున్నాయి. అయినా, ఆమె ఏడుస్తూనే వుంది. మధ్యమధ్యన కొడుకు శవం మీదపడి కుమిలి కుమిలి ఏడుస్తోంది. చిన్నప్పుడు తన కొడుకు ఆట పాటల్ని గుర్తుచేసుకొని ఏడుస్తోంది. వీడు బతకాలని పడ్డ బాధల్ని గుర్తుచేసుకుని మరీ మరీ ఏడుస్తోంది.

జబ్బుచేసిన తన కొడుకుని ఎంతో మంది నాటు వైద్యులకు చూపించింది. మందులిప్పించింది. సర్కారు దవాఖానాకు తీసుకెళ్ళింది. అయినా రోగం కుదరలేదు. దిక్కులేని వాడికి దేవుడే దిక్కు అని అందరూ అనగా, ఈ దేవుని దగ్గరకొచ్చి గుడి ముందు మూడు వారాల నుండి చేయించిన పూజలను గుర్తుచేసుకొని ఏడుస్తోంది.

డబ్బు అడగలేదు, ధాన్యమడగలేదు ఈ దేవుణ్ని. వున్న ఒక్క కొడుకును బతికివ్వమని కోరిందంటే తలవైపు కూర్చున్న తండ్రి కొడుకు ముఖం వైపు చూస్తూ మూగగా ఏడుస్తున్నాడు.

ఈ దేవుడు సంతానం ఇవ్వకున్నాపాయె, ఇచ్చి ఎందుకు తీసుకపోయే అంటూ ఆలోచిస్తున్నాడు. రేపు ఛస్తే ముందల ఎవ్వడు నడుస్తాడు అంటు కుమిలికుమిలి ఏడుస్తున్నాడు.

"ఆ దేవుని గుళ్ళో మన్నుపొయ్య, కాటికి కాళ్ళు సాపిన నన్ను చంపుక పోవద్దా, ఏ పాపం ఎరుగని పసి కూన నెందుకు తీసుకపోయె!" అంటూ తెల్లగా నెరసిన తలను బాదుకుంటూ ఏడుస్తున్నప్పుడు పలచగ కారే కన్నీరు ముడతలు పడ్డ చెంపలు దాటి, పళ్ళులేని నోటిలోకి జారుతున్నవి.

మధ్య మధ్యన శవం మీద వాలే ఈగల్ని చేయితో లేవగొడుతోంది.

జనం ఏడుపును విని చుట్టూ చేరారు. ఎవరి నోట మాట రావడం లేదు. వాళ్ళు దేవుణ్ని తిట్టినా, ఎవరూ ఏంమాట్లాడడం లేదు. కళ్ళల్లో తిరిగిన నీరును కొంగుతో అద్దుకుంటూ ఏడిచే తల్లి వైపు చూస్తూ నిలుచుంది రాధమ్మ. ఆమె తల నిండా ఆలోచనలే! ఈ దేవుడు, ఈ దేవుని పేరు మీద జరిగే తంతు అంతా అయోమయం అనిపించింది.

"జరగండి, జరగండి ఏం జరిగింది" అంటూ ఓ పూజారి భుజం మీది సిల్క్ వుత్తరీయాన్ని కదిలిస్తూ వొచ్చి నిలుచున్నాడు.

అతన్ని చూసిన తల్లి మళ్ళీ దేవుణ్ని తిట్టడం మొదలు పెట్టింది. ఆ తిట్లు వినలేక ఆ పూజారి "శివ శివ" అంటూ చెవులు, కళ్ళు మూసుకున్నాడు. తల్లి తిడు తూనే వుంది.

"ఇది కర్మ. పూర్వ జన్మ ఫలం భరించ వల్సిందే" ఎవ్వరు మాట్లాడలేదు.

"రోగమొచ్చి ఛస్తే ఎవరేం చేస్తారు. దేవుణ్ని తిడితే ఏమొస్తది" పూజారి.

"మరే దయ్యాన్ని తిట్టమంటారా, దయ్యం చంపుక పోద్దనే దేవుని దగ్గరకొస్తే — "ఎవరో అనే లోపునే

"రోగమొస్తే దేవుడేం చేస్తడు-"

"అయ్యా బాపనయ్య వాళ్ళు మొదలే కడుపు కాలి వుందు - నీవు ఇక్కన్నించి ఎల్లిపో అంటూ అన్నాడో పెద్దమనిషి. పూజారి నోరు మూసుకుని అక్కడి నుండి పోయాడు.

"పద రంగా" అంటూ కచ్చడం వున్న వైపు నడిచారు.


జనం గుంపులు గుంపులుగా కొబ్బరి కాయలతో, అగరొత్తులతో, కుంకుమ పొట్లాలతో గుట్టెక్కుతూనే వున్నారు. పై నుండి గంటల చప్పుడు వినిపిస్తూనే వుంది.

5

గుట్ట పక్కనున్న ఓ వేపచెట్టు, దాని పక్కన ఓ డేరా వేసి అందులో పోలీసువాళ్ళు వుంటున్నారు. చెటు క్రింద ఓ టేబుల్, కుర్చీ, రెండు బెంచీలు వేసుకుని దాన్నే ఆఫీసులా వాడుకుంటూ ఓ ఎస్.ఐ., ఓ నలుగురు కానిస్టేబుల్స్ వుంటున్నారు.

తిరునాలలో ఏ గొడవ, ఏ దొంగతనం జరక్కుండా చూస్తూ ఆ వారం రోజులు అక్కడే వాళ్ళ క్యాంప్.

హెడ్ రశీద్ ఓ బెంచి మూలన కూర్చోని ఆ రోజు దినపత్రిక చదువుతున్నాడు. ఎస్.ఐ. ఏదో పని మీద టౌన్ కెళ్ళాడు. ఓ కానిస్టేబుల్ వంట దగ్గర వంటచేసే వానికేదో చెబుతూ కోడిని ముక్కలుగా తరుగు తున్నాడు.





మరో కానిస్టేబుల్ ఓ పడుచుదాన్ని, ఓ ప్రౌఢను తీసుకొచ్చి హెడ్ గారి ముందు నిలుచోబెట్టి వాళ్ళను గూర్చి ఉరుదులో ఏదో చెప్పాడు.

"అచ్చా" అంటూ హెడ్ దినపత్రికను టేబుల్ మీద వుంచాడు. కాగితం, కలం తీసుకొని "నీ పేరేందే?"

"బాయి"

బాయి అంటే

"బాయో చెరువో పూర్తి పేరు చెప్పు" కానిస్టేబుల్ తన చేతిలోని లాఠీని బెంచి మీద ఆడిస్తూ

"ఎల్లు బాయి"

"గట్ల చెప్పు" హెడ్డు.

"మొగని పేరు"

ఆమె నవ్వింది. ఆమె వెంట వున్నావిడ నవ్వింది.

అప్పుడే వచ్చిన కల్లుకుండను దించడానికి కానిస్టేబుల్ వేపచెట్టు మొదలు వైపు నడిచాడు. పొంగులు పొంగుతున్న కల్లుకుండను చెట్టు మొదట దించాడు. కుండను దించి తల మీద చుట్టగా చుట్టి వున్న కొంగును దులిపి భుజం మీద వేసుకుంది.

కానిస్టేబుల్ వంగి పొంగుతున్న పొంగును వేలితో తీసుకొని ముక్కు దగ్గర పెట్టుకొని వాసన పీల్చి—

"మంచి గుందా, గట్టి కల్లేనా?"

"వాసన చూస్తే ఎట్ల తెలుసుద్ది. ఇంత సై చూడు తెలుసుద్ది" అంటూ నవ్వును పెదాల మీద కదిలిస్తూ వంగి కానిస్టేబుల్ చారలోకి కల్లును వంపింది. నురుగును తొలగించడానికి వూది కానిస్టేబుల్ చారలోని కల్లును ఓ గుటక మింగి మిగతది కింద పోస్తు "బాగుంది" అంటూ కన్ను ఓసారి మూసి తెరిచాడు.

"మేము కల్తీ కల్లు అమ్మనే అమ్మం" అంటూ చేతికి అంటిన నురుగును చెట్టు మొదలకు రాసింది.

"కల్లు బాగానే వుంది గానీ మరి పిల్ల" అంటూ మధ్యలోనే ఆపి ఆమె వైపు చూశాడు.

"పిల్లలు కరువు బోయినారు. తిరువాలేవాయే! అయినా మీ కెరుక లేదా నన్నడుగుతున్నారు గానీ"

"ఎరుకే గానీ మమ్ముల చూసి భయపడతారు"

"భయం లేదు, గియం లేదు. మీరు పైసలియ్యరని ఎవరు రారు?"

"అంతేనా"

"అంతోగింతో గానీ నాకు పైసలిప్పియుండి? నేను పోత. ఈయల్లటికి ఐదు రోజులు. ఐదు కుండలు పొద్దటి జాము, మాపటి జామో ఐదు పటవలు. అన్నింటివి యియ్యాల యియ్యండి?"

"యిస్తం సాయంత్రం వొచ్చి లెక్క చూసుకొని పో! ఇప్పుడు హెడ్‌గారు పనిమీదున్రు."

చెట్టు దగ్గరి నుండి కదలి "ఆయన్నే తోలుత. అదేంది ఆల్లను తీసుకొచ్చిండ్రుగా ఇంకేంది" అంది హెడ్ ముందు నిల్చున్న యిద్దరాడవాళ్ళను చూపిస్తూ.

"ఆల్ల మీద కేసు బుక్ చేసినం"

"అందుకే రారు"

"అందరి మీద పెడతామా"

"అరే క్యారే వీరయ్య వీళ్ళు మొగని పేరుచెప్ప మంటే నసుగుతున్నారు. బంచోత్" హెడ్.

"ఆల్లకు మొగలుంటర" అంటూ గౌండ్ల స్త్రీ ఆగింది నవ్వుతూ.

"ఆల్లకు లేరు. నీకు లేరు. మొగడు లేంది ఎట్ల వుంటరు. గాజులు, మెట్టెలు వున్నాయి గదా!"

"నా కెందుకు లేడుగానీ"అంటూ తన దృష్టిని వాళ్ళ వైపు మరిపి -

"అల్లకు ఎందుకుంటరు! వాళ్ళు జన్నేకేడిసి పోన్నాయే"

"అంటే"

"చెప్పమ్మా గొండ్లామె. మా సార్ గారికి తెలువదు"

"అదే ఎందుకు తెలువదు. ఆయనకు తెలువకపోతే మరి నీకు తెలువదా, నీవు చెప్పరాదు"

"నాక్కూడా తెలువదు" వీరయ్య.

"ఏమని రాయించెంద్రదే ఎల్లుబాయి" అంటూ వాళ్ళవైపు చూస్తూ అడిగింది.

"వున్నదున్నట్టే రాయించినం" అంది బాయి.

"ఏమి రాయించిండ్రు సారు"

"మొగని పేరు చెప్పమంటే దేవుడు అని చెబుతున్నారు. దేవుడు అంటే అల్లా! అరే బద్మాష్ అంజల్ దేవుని పెండ్లాలా మీరు? వీళ్ళ పిరలు పగలకొట్టు బంచోత్" వీరయ్య నవ్వు నాపుకుంటూ-

"మొగని పేరు చెప్పమంటే దేవుని పేరు చెప్పినరే" వాళ్ళను సమీపించుతూ, "అంతేగద మరి. వీళ్ళకు మొగలెక్కడ వుంటరు. పెండ్లీడు రాగానే దేవుని పేర వొదిలి పెడతరు. కత్తికి బాసి కట్టి పెండ్లి కూడా చేస్తరు. అందుకనే వాళ్ళు సచ్చేంత వరకు ముత్తైదువగానే వుంటరు. గిట్లనే వూరూరా తిరిగి కాలం గడుపుతుంటరు. తిరునాలగదా ఇక్కడి కొచ్చిండ్రు. ప్రతి ఏడు ఒస్తరు మా దగ్గరే కల్లు కూడా తాగుతరు.




"ఏం కల్లు తాగుతరో పోరగాళ్ళను రెచ్చగొట్టి పాడు చేస్తుండ్రు. ఏ వాగుల చూసిన, ఏ చెట్టు సాటున చూసిన యిల్లే. చూసి చూసి తంగై పట్టుకొచ్చిన"

"పట్టుకొస్తే ఏం లాభం. వాళ్ళ దగ్గర ఏముంది. ఎట్ల బతికేటోళ్ళు అట్ల బతుకుతారు." అంటూ గొండ్ల స్త్రీ తాను చెప్పిన తోవ పట్టింది.

"క్యారే వీరయ్యా, గొండ్లది బాగుందిరే గజ్జం గుర్రం."

"పైసండిగితే పొద్దాక రమ్మన్న"

"అన్నవా అయితే ఓ-"

"కానీ మొగుణ్ణి తోల్క రమ్మన్నది సార్."

"ఆ మా సంగతి చెప్పండి" హెడ్ ఆడవాళ్ల వైపు మళ్ళుతూ, మా సంగతే ముంది కొత్తగా చెప్పడానికి. మా సంగతి లోకాని కంతా ఎరుకే."

"కుచ్ నా కుచ్ దేఖే చెలే జావో బోలోరే వీరయ్యా కాంసే లాయేరే కంత్రి—" వీరయ్య నవ్వు నాపుకుంటూ "నేనేం చెయ్యను సార్, వీళ్ళంతా న్యూసెన్స్ చేస్తుంటే పట్టుకొచ్చిన వాళ్ళవైపు మళ్లీ—

"ఏమన్న ఇచ్చుకొని ఎల్లిపొండ్రి ముండలార"

"మా దగ్గరేముంది యిస్తందుకు"

ఈసారి తిరునాలు ఒట్టి దండగే. ఏ బాడ్‌కావ్ దగ్గర పది రూపాలే లేవు. మల్ల అందరూ మాసి పండ్లిగిలిస్తోళ్లే. పోతూ పోతూ భుజాలు రాసుకునో కాననట్టు కాలు తొక్కో ఏటో చూస్తున్నట్టో చూస్తూ మందిలో నిలబడి పిరలకు తాకో, గాజులు, మట్టెలు పెట్టుకునే దగ్గర మా పక్కమ్మటే ఒంగి చెంపలకు చెంపలు ఆనించి, మా పెల్లెలు పామెనో అనో,


దీపావళి శుభాకాంక్షలు

వివాహాది శుభకార్యములకు కావలసిన

కంచి, ధర్మవరం, బనారస్,

చందేరి, పట్టు ఇంకా ఫ్యాన్సీ చీరలకు

కంచి కామాక్షి శారీహౌస్

8వ లైను అరండల్‌పేట గుంటూరు-2

Phone: 31824

రూపాయి చిలకల పేరు కొని మెడల ఏసి "బాగుంధే బాయి" అని రొమ్ములను తాకో, కల్లు పోపిచ్చి, కారాపుట్నాలు పెట్టి కౌగిలించుకొని రాత్రికి వొస్త ఆడ వుంటరనో తప్పించుకు పోతుమ్రు.

ఈ ఏడు మొగళ్ళంతా, ఇంత యిదిగ ఏ తిరువాలు ఎక్కడ జరగలేదు. రోజు వందో, ఏభయో కండ్ల చూసేవాళ్ళం.

ఇదైతే కొత్త పోరి. పోయినేడే కన్నీర్కం పెట్టింద్రు. ఎవ్వడొస్తడు ఓ రూపాయి చేతుల పెట్టి గిచ్చి పోతున్నాడే తప్ప పడుకో పడిస్త అంటుండా!

ఎవడో ఒకడు కొత్తపోరడు ఓ పూటంతా మమ్ములనే చూస్కుంట, మా యెంటే తిరిగి ఎవరు లేనిది చూసి, గడ గడ వణుకుతు "ఒస్తవా" అంటే సరే రానోడు రాకపోయే ఒచ్చినోడే సయి అని పోతే ఆడు అటు ఇటు చూసి రెండు రూపాలే చేతుల బెట్టే! నిలబడే! ఇంక రెండు రూపాలియ్యి నేరిపిస్త అంటే, ఆడు వా దగ్గర గయ్యే వున్నయనే!

గుక్క తిప్పకోకుండా ఎల్లుబాయి మాట్లాడు తుంటే, వీరయ్య గుడ్లప్పగించి చూస్తున్నాడు. తెలుగు సరిగా మాట్లాడ రాకున్నా మాట్లాడుతుంటే తెలుసు కునే హెడ్ రశీద్ సాబ్ గూడా ఆమె మాటలను ఇంట్రెస్టుగా వింటున్నాడు. ఆమె మళ్ళీ మొదలు పెట్టింది.

"ఇక మమ్ముల మామూలు ఎక్కమంచి తెమ్మం టరో చెప్పండ్రి"

మీరు ఒట్టి దండగ మంచులు బంచోత్ అదే బొంబాయిలయితే ఒక్కొక్కటి రోజుకు వేయి కమాయిస్తది"

"అల్ల కొస్తవి. మాకు రావు."

"అల్లు చేసేది అదే పని, మీరు చేసేది అదే—" వీరయ్య

ఎల్లుబాయి ఏడవలేక నవ్వుతూ "దొరారింట్లో కుక్క మనుషుల్లాగే బతుకుద్ది. మరి ఊర్లో తిరిగే కుక్క? గా బతుకే మాది కూడ. పుట్టుకతో రెండు కుక్కలైనా పుట్టిన స్థలాన్ని బట్టి కదా బతుకు బలికేది."

పోలీసులు ఆలోచనలో బడ్డారు.

"ఒకప్పుడు ఈ పని చేయుడం మా హక్కను కున్నాం. మా వొళ్లే మా ఆస్థనుకున్నాం. రోజులు మారినయి. పూట గడవకుంటొచ్చినది. రాను రాను మమ్ముల పురుగుల చూసినట్టు చూస్తున్నరు. మేము గూడా ఈ పనిని మానాలనుకుంటున్నం. మా పిల్లలను ఇప్పట్నుంచి ఇల్ల బతకనీయ. ఏ కూలి నాలయినా చేసి పూట గడుపుకోలేమా" అంటూ ముగించిన ఎల్లుబాయి కళ్ళనిండా కన్నీరు!?

మోటారు సైకిల్ [illegible] వినిపించగానే.

"ఎస్.ఐ. గారొస్తున్నారు. అటుపక్కకు జరు గుండ్రి" అంటూ బెంచి మీది లాటిని చేతిలోకి తీసుకున్నాడు ఎడ్‌గారు. లేపి నిలుచొని బెల్ట్ సరిచేసు కొని క్యాప్‌ను సవరించుకున్నాడు.

వాళ్ళిద్దర్ని టెంట్ పక్కకు తప్పకోమని సైగ చేశాడు వీరయ్య.



## కళింగం

అందరి దృష్టి కళింగంమీదే వుంది
అశోకు డొక్కడే విరోగమించాడు;
అందరూ విజయగర్వంతో ఉన్నత శిరస్కులై
కవాతు చేస్తున్నారు
అశోకు డొక్కడే అవనత శిరస్కుడై మౌనంగా
అనుసరిస్తున్నాడు;
అందరూ హాయిగా నవ్వుతూ తృళ్ళింత
లాడుతున్నారు
అశోకు డొక్కడి చెవుల్లోనే రణిస్తోంది
మరణమృదంగం;
అశోకు డొక్కడే కత్తిదింపాడు
అశోకు డొక్కడే పోరాడుతున్నాడు.

హిందీమూలం: శ్రీకాంతవర్మ

తెలుగు సేత: డాక్టర్ గంటి శ్రీరామమూర్తి

డేరా ఎదురుగ మోటారు సైకిల్‌ను ఆపి స్టాండ్ వేసి డేరాలోకి వొస్తూనే -

"ఆ.. ఏమన్నా కేసులు బుక్ అయ్యాయా" ఎస్.ఐ." పి క్యాప్‌ను తీసి టేబుల్ మీద వుంచుతూ తన కోసం వున్న కుర్చీలో కూర్చున్నాడు.

"జాతర్లో ఏం తప్పలు జరగడం లేదన్నమాట!" ఎస్.ఐ. టేబిల్ మీద వున్న లాఠీని రెండు చేతుల్లో ఆడిస్తూ—

"అ జరక్కొట్ల నద్నుద్ది గానీ అందరూ—" అంటూ తన టోపిని వెనకవైపు నుండి లేపి మళ్ళీ తలకు సర్దుకున్నాడు.

"మరి అన్నీ" అంటూ రెండు చేతుల్లో వున్న లాఠీని కుడి చేతిలోకి తీసుకొని ఓ కొనను పట్టుకొని రెండవ కొనతో టేబుల్ మీద కొడుతూ అడిగాడు ఎస్.ఐ.

"మన 555 పి.సి.ని పంపాను సార్, కొన్నే వసూల్ అయ్యాయి సార్" ఎడమ చేయిని తొడ కానించి కుడిచేతిని కదిలిస్తూ చెప్పాడు హెడ్!

"అంటే-" అంటూ లాఠీని టేబుల్ మీద వొదిలి కుర్చీలో రిలాక్స్ అయినట్టు వెనక్కు వొరిగి కూర్చు న్నాడు.

"మూడు ముక్కలోడు వొచ్చి ఇచ్చి పోతనన్నాడట సార్. శ్రాప్ షావుడు తమర్నే కలుస్తానన్నాడు సార్! సరకస్సోడు సాయంత్రం కలెక్షన్‌ల తర్వాత ఇస్తానన్నా డట సార్, రంగుల రాట్నపోడు గుమాస్తా నుంచి వొనరు టౌన్ కెళ్లాడట సార్, కొంచె మాగి నేనే వెళ్ళొస్త సార్, పోతే చిల్లర దుకాణపోళ్ళు దాదాపు అందరూ ఇచ్చినట్టే సార్" మరొక సారి బెల్ట్‌ను సరిచేసుకుంటూ అన్నాడు.

"ఎవరిచ్చారో ఎవరియ్యలేదో కానీ సాయంత్రం సి.ఐ. గారొస్తున్నారు. ఆయనెంట ఆయన దోస్తులు అదే ట్రెజరీ వాళ్ళొస్తారట. ఇంత జాస్తి, పైన దర్శనం అయన్ని చూడాలి"

"అదేంది సార్! ఆ ట్రెజరోల్లు మన సి.ఐ.గా రెమ్మటి తిరుగుతారు. వాళ్ళకు పని పాట వుండ నటు ౦ది:"

"వాళ్ళకు పనీ పాట లేక గాదు, స్వంతంగా శిఖారు చెయ్యడం రాక. అందుకని వాళ్ళు మనెమ్మటే వుంటరు" అంటూ ముసిముసిగా నవ్వాడు.

## 6

పొగాకు అమ్మిన తర్వాత లెక్కలు సరిచూసుకొని దాని తాలూకు డబ్బు తీసుకుని అబిడ్స్‌లోని బార్ అండ్ రెస్టారెంట్‌కు చేరేసరికి తొమ్మిదైంది. చేతిలోని క్యాష్ వంకలో సర్దుకుని, బార్‌లోకి వెళ్ళే మెట్లు ఎక్కిపోతూ కాసేపు ఆగి అక్కడి బోర్డు మీద అంటించిన ఆనాటి కేబరే బొమ్మలను చూసి అందరూ కొత్తవాళ్ళే అను కుంటూ స్ప్రింగ్ డోర్‌ను నెట్టుకుంటూ లోపలికి నడిచాడు పాండయ్య. ఈయనగారి రాకను గుర్తుపట్టిన స్టివర్డు ఒకడు ఎదురుగా వచ్చి చిరునవ్వు నవ్వి తను సర్వ్ చేసే టేబుల్ దగ్గర కూర్చోబెట్టాడు.

సన్నగా ఇంగ్లీష్ మ్యూజిక్ వినిపిస్తోంది. డాన్స్ చేసే స్టేజీ వెనక వైపు వాయిద్య బృందం కూర్చొని వున్నారు. హాలంతా మంచి గంధపు వాసనే కాదు, నిండివున్న కస్టమర్స్ రాసుకొని వచ్చిన రకరకాల సెంట్ల వాసన కూడా వస్తూనే వుంది.

స్టివర్డు 'మెను' ముందుంచాడు. పాండయ్య సర్దుకుని కూర్చోని తాను ఎప్పుడు తాగే విస్కీ పేరు చెప్పి అంతేకాదు నాకు ఇంగ్లీషు అంతగా రాదు. మెను చూస్తూ కూర్చోలేను. చికెన్‌లో ఈరోజు స్పెషల్ తీసుకురా.

"ప్రాన్స్ ఐటమ్స్ ఏ మొద్దాసార్"

"తర్వాత చూద్దాం"

"సరే సర్" అంటు స్టివర్డు అక్కడినుండి కదిలాడు.

ఈలోపున మ్యూజిక్ మారింది. డప్పు ఒక్కసారే మ్రోగినవి. ఎక్కడనుండో ఓ సీతాకోకచిలు కొచ్చి మ్యూజిక్‌ను అనుసరించి కదలసాగింది. రెప్పవాల్చ కుండా చూస్తూ పాండయ్య బేరర్ తెచ్చిన బాటిల్ గ్లాస్‌ను చూసేటట్టులేడు. గ్లాసులో పెగ్గుపోసి, సోడా కలిపి "ఐస్ వేయమంటారా సార్" అన్నప్పుడుగానీ అతని చూపు టేబుల్‌వైపు మళ్ళలేదు.

"వేయండి" అంటూ తాను గ్లాసు అడుగుభాగాన్ని

పట్టుకున్నాడు. బేరర్ టేబుల్ మీదున్న ఐస్‌కిట్‌లో నుండి ఐస్ తీసి గ్లాసుల్లో వేసి తాను అక్కడినుండి తప్పుకున్నాడు. పాండయ్య విస్కీని పీల్‌చేసి నాప్‌కిన్‌ను తొడమీద వేసుకొని మళ్ళీ కేబరేట్ వైపే చూడ సాగాడు.

మ్యూజిక్ మోగిపోతూంది. ఆమె మెలికలు తిరిగిపోతూంది. ఉన్నట్టుండి మళ్ళీ డ్రమ్స్ మోగాయి. మరొక కేబరేట్ స్టేజీ మీదకొచ్చి వాలింది. అంతకు ముందున్నావిడ స్టేజీ దిగి కష్టమర్స్ టేబుల్ దగ్గరికి వెళ్ళి పలకరిస్తూ పరాచికాలు ఆడుతోంది. నృత్యం చేసే కేబరేట్ చాలా అందంగా వుంది. వెడల్పయిన కళ్ళతో అందర్నీ అలరిస్తూంది. బిగువైన వక్షస్థలాన్ని కదిలిస్తూ కష్టమర్స్‌కు కన్నుకొడుతూ కవ్విస్తూంది.

మొదటి పెగ్గు అయిపోయింది.

మొదటి క్యాబరేట్ వచ్చి రెండవ పెగ్గు నింపి తన పెదాలకు ఆనించి తీసి పాండయ్య కందించింది. నవ్వుతూ అందుకుని తన ఎడమ చేతితో ఆమెను తాకాడు. ఆమె సుతారంగా అతని చేతిని తొలగించుకుని "యూ సిల్లీ" అంటూ మరో టేబుల్‌ను సమీపించింది.

ఈలోపున మ్యూజిక్ మారింది. రెండవ క్యాబరేట్ గూడ కష్టమర్స్‌ను ఒక్కరొక్కర్నే కలుస్తూంది. మ్యూజిక్ బృందం ప్రక్కన ఇంతవరకు కూర్చున్న పాతికేళ్ళ పడుచువొచ్చి సినిమా పాటలు పాడుతోంది.

## మనిషి విలువ సున్న

మనిషి కన్న పక్షి మిన్న
తన రెక్కల బలంతోడ
వినువీథుల తిరిగి తిరిగి
తన గూటిని కట్టుకొనును
తన మేతను తెచ్చుకొనును
మనిషి కన్న మృగం మిన్న
ఆకలి అయినప్పుడె
ఆహారం తీసుకొనును
అధికంగా మెక్కి మెక్కి
అజీర్తితో బాధపడదు
మనిషి కన్న పాము మిన్న
తన రక్షణ కోసమ్మె
తరిమి తరిమి బుసకొట్టును
కసితో తను చంపువాని
విసపు కోర కెరసేయును

—కనమలూరు వెంకటశివయ్య

ఆమె వొంటినిండా మాత్రం గుడ్డలున్నవి. అలా ఓ అరగంట గడిచింది. ఈలోపున రెండవ క్యాబరేట్ పాండయ్య దగ్గరకొచ్చి పక్క కుర్చీలో కూర్చుంటూ కన్నుకొట్టింది. అతను నవ్వాడు. ఆమె నవ్వింది. యిద్దరూ చేయి చేయి కల్పుకున్నారు. ఆమె అతని గ్లాసు నింపింది. తన చేతితోనే తాపించింది. గ్లాస్ ఖాళైంది "ఒకే" అంటూ గ్లాస్ టేబుల్‌మీద పెట్టి అతని వైపు, గ్లాస్‌వైపు, బాటిల్ వైపు చూపింది. అది గమనించిన బేరర్ మరో గ్లాసును తెచ్చి టేబుల్ మీద పెడుతూ పాండయ్యవైపు నవ్వుతూ చూసి తప్పుకున్నాడు. హాలులో చాలామంది వీళ్ళిద్దరివైపు చూస్తున్నారు.

ఈసారి గ్లాస్ పాండయ్య నింపజూస్తే తన మూతిని గుండ్రంగా చేస్తూ "నో-నో అయామ్ హియర్" అంటూ తానే రెండు గ్లాసులు నింపి ఓటి అతని కందించి, మరో గ్లాస్‌ను తాను తీసుకుని "ఛీర్స్" అంటూ గ్లాసులు కలిపి తన పెదవులు తడుపుకుంది. అటు చూస్తున్న చాలామంది తన టేబుల్‌మీదికొస్తే బాగుండు అనుకుంటున్నారు. "డార్లింగ్" అంటూ అతని చెవిదగ్గర పెదాలు పెట్టి ఏదో గుసగుస-బేరర్ చూస్తూనే వున్నాడు.

మరింత దగ్గరగా జరిగి అతని భుజాలకు తన భుజాలను తాకించింది.

పాండయ్య తన చేయిని ఆమె మొలచుట్టు చుట్టాడు.

అది గమనించిన ఆమె తనకాలితో అతని కాలిని తొక్కిపట్టి పెదవిని కొర్కిపట్టి అతని చేయిని వదిలించుకుంది.

"డార్లింగ్" మళ్ళీ చెవి దగ్గర.


Gold Spot Limca Thums Up

రూ. 2,500 మావద్ద డిపాజిట్ చేయండి· సంవత్సరం పొడుగునా మా డ్రింక్సు ఉచితంగాపొందండ

ఫ్రీ డ్రింక్ డిపాజిట్ పథకం

మా ఫ్రీ డ్రింక్ డిపాజిట్ పథకంలో చేరి మా గోల్డుస్పాట్, థమ్సుఅప్, లిమ్కా,
కిస్మత్ పానీయములు ఉచితముగా పొందండి.

మా వద్ద రూ. 3000 లు డిపాజిట్ చేసిన వారికి ప్రతినెల ఒక క్రేట్ (24 బాటిల్సు) పానీయములు ఉచితముగా లభించును. ఈ డిపాజిట్ ఒకటి లేక రెండు లేక మూడు సంవత్సరములకు మా వద్ద డిపాజిట్ చేయవచ్చు. ఆ తరువాత మీ డిపాజిట్ మొత్తమును వాపసు తీసుకొనవచ్చును.

ఈ పథకం నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు అనంతపురం జిల్లాలకు మాత్రమే పరిమితము

వివరములకు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించండి

పినాకిని బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్

గుడిపల్లిపాడు-524 314 నెల్లూరు జిల్లా

ఫోన్స్: 43, 63, 64 చిన్నచెరుకూరు.

''హు'' చెప్ప అన్నట్టు చూశాడు.

''నా గదిలో మా అమ్మ వుంది. ఆవిడకు బీరంటే యిష్టం. రెండు బీర్లు, ఓ జింజర్ ఫ్రాన్స్ పంపవూ?'' అతని గడ్డాన్ని పట్టి వూపుతోంది. అది గమనించిన బేరర్ ఎదుటికొచ్చి నిలిచాడు. ''రెండు బీర్లు ఓ ఫుల్ ఫ్రాన్స్-వీళ్ళ మదర్'' అనేలోపలే ''యస్ సర్'' అంటూ కదిలిపోయాడు.

ఆవిడ అటు ఇటు చూసి అతని బుగ్గను సుతారంగా గిల్లి లేచిపోయింది. లైట్లు వెలిగాయి. అందరూ తిండి వైపు మళ్ళారు.

రకరకాల జోక్స్ వేసుకుంటూ తింటున్నారు టేబుల్ ఫ్రెండ్స్. అరగంట గడిచింది. మళ్ళీ వాయిద్యాలు మోగాయి. లైట్స్ డిమ్ అయ్యాయి. మొదటొచ్చిన కేబరేట్ ఈసారి చాలీ చాలని తక్కువ బట్టలతో వొచ్చింది. లైట్లు వెలుగుతూ ఆరుతూ వున్నవి. డ్రమ్ మ్రోగినప్పుడల్లా ఆమె తన ఒంటిమీద బట్టల్ని ఒక్కటొక్కటే విప్పేస్తూవుంది. జనం వూపిరి బిగపట్టి ఆమె వైపే చూస్తున్నారు.

ఆమె స్టేజి మీద నగ్నంగా పడి పొర్లింది. ఉడతలా వూగిపోయింది. పాములా మెలికలు తిరిగింది. డ్రమ్ మోత ఒక్కసారే ఆగింది. ఆమె గ్రీన్ రూంలోకి పరిగెత్తింది. రెండవసారి డ్రమ్ మ్రోగింది. మరో కేబరేట్ నోటిలో సిగరెట్‌తో, మత్తెక్కిన కళ్ళతో స్టేజి మీదకొచ్చింది. అదో మాదిరిగా సిగరెట్‌ను పీల్చి పొగను వలయాకారాలుగా వొదులుతూ నిలుచుంది.

ఆమె ఈసారి పొడవైన గౌన్ ధరించివుంది. అందరి వైపు చూస్తూ సిగరెట్ ఎవర్కి కావాలి అంటూ అడుగుతోంది. చాలామంది చేతులు చాపారు. కానీ ఆమె మాత్రం ఓ బోడుగుండు తాత కందించింది. అతని ఆనందానికి అవధులు లేవు. మ్యూజిక్‌కు అనుగుణంగా కదులుతూ తాను తొడుక్కున్న గౌన్ జిప్‌ను చూపిస్తూ లాగమని సైగ చేసింది. ఓ గడ్డం సాహెబ్ వొచ్చి జిప్ లాగాడు. అటు తిరిగి గౌను కిందికి జారవిడిచింది. ఆవిడ



చిత్రం : యస్. కాత్యాయని

పళ్లంతా కనిపిస్తు వుంటే ఎగురుతూనే వుంది.

ఒక బ్రా సన్నని కట్ డ్రాయర్ మాత్రమే ఆమె ఒంటిమీదున్నవి. వాటి రంగు ఆమె వొంటి రంగులాగే వున్నవి.

ఆమె స్టేజీ నలుమూలలా తిరుగుతూ కేకలేస్తునే బ్రాను తొలగించుకొని తన రెండు చేతులు కప్పుకుంది. అందరూ ఆమెవైపు చూస్తున్నారు. ఆమె పొందయ్య వైపు మళ్ళి చేతులు తొలగించింది. లైట్లు మరీ డిమ్ అయినవి. అంటే ఆమె ఒంటిమీద నూలుపోగు లేదు. అందరు చప్పట్లు కొట్టడం ఆపేశారు.

అక్కడ కోర్కెలు కొట్లాడుతున్నయ్. చూపులు పేలాడుతున్నయ్. మత్తెక్కిన సరసాలు మనుషుల సంస్కారాన్ని మంత్రించి వేస్తున్నవి. ఒక్కసారే డ్రమ్ మ్రోగింది. అంతే వంగి తన గౌనును అందుకొని తన వంటిపై కప్పుకుని గ్రీన్ రూంవైపు పరుగులాంటి నడకలో వెళ్ళింది.

లైట్లు వెలిగినాయి.

స్టీవర్డ్సు బిల్స్ టేబుల్స్ మీద వుంచుతున్నారు.

జేబుల్లో వున్న నోట్సు కౌంటర్ చేరుతున్నవి.

చిల్లర నోట్లను వొదులుతూ అందులోని సొంపును తీసుకుంటూ ఒక్కొక్కరే కదిలిపోతున్నారు.

పొందయ్యా కదిలాడు తన బ్యాగ్‌ను చంకన పెట్టుకొని.


## (7)

తారురోడ్డుమీద బస్ మెత్తగా నడుస్తోంది. కండక్టర్ టికెట్స్ నెంబర్స్‌తో ఎస్సార్‌ను నింపుకుంటు న్నాడు.

టూ సీటర్ మొదటి సీటులో కూర్చున్న పొందయ్య ఏదో వారపత్రికను తిరగేస్తూవున్నాడు. పత్రిక చివరలో వున్న సినిమా అనుబంధం పేజీలలో రకరకాల సినిమాల గూర్చిన ఫోటోలున్నాయి. వాటిలో జయమాలిని ఫోటో ఓటి అర్ధనగ్నంగా రంగుల్లో వుంది. దాన్ని చూసేసరికి పొందయ్యకు రాత్రి క్యాబరేట్స్ కళ్ళల్లో కదిలారు. పత్రికను మూసి పట్టుకొని సీటుకు తల ఆనించి కళ్ళు మూసుకొని రాత్రి దృశ్యాలను మరీ మరీ గుర్తుకు తెచ్చుకున్నాడు. స్త్రీ నగ్నంగా వుంటే ఎలా వుంటుందో, ఆ ఆకారం పురుషున్ని ఎంత రెచ్చగొడుతుందో మరీ మరీ గుర్తుచేసుకున్నాడు.

అసలు ఊహ చాలా తీయనిది. నిజ జీవితంలో పొందలేనివన్నీ మనిషి ఊహల్లో పొందుతాడు. ఆకాశం విశాలంగా వున్నట్లే ఊహ చాలా విశాలంగా వుంటుంది. మందులో మత్తున్నట్టే ఊహల్లో మత్తుంటుంది. నిజ జీవితంకంటే ఊహల్లోనే తృప్తి వున్నట్టు ప్రతి మనిషికి






కొన్ని గుర్తులు.

ప్రతి సీటర్స్‌రోలో లోపలివైపు కూర్చున్న స్త్రీ తనవైపు చూసినట్టనిపిస్తే తాను ఆమెవైపు చూశాడు. కానీ ఆమె బస్సు పరిగెత్తేటప్పుడు కదిలే చెట్లవైపు చూస్తోంది. తాను ఆమెవైపు చూసినట్టు తన పక్కన వున్నవాళ్ళు చూశారా ఏమి అన్నట్టు, తాను అందరివైపు చూసి ఏమితెలియనట్టు మళ్ళీ వారపత్రికను తెరచి పేజీలను తిప్పసాగాడు. డాక్టర్ సలహాలు అన్నచోట ఆగి చదవసాగాడు.

ప్రశ్న: నాకు పెళ్ళయి రెండేళ్ళు. ఇద్దరం అన్యోన్యంగా వుంటున్నాము. రతి జరిగే టప్పుడు గుడ్డల అడ్డు వుండొద్దు అని నేనంటే ఆమె ఒప్పుకోదు. అప్పుడప్పుడు బొమ్మల్లో స్త్రీలను నగ్నంగా చూసిన నాకు ఇంట్లోకూడా అలాగే చూడాలి అని మనస్సు కోరుతుంది. కానీ ఆమె అంగీకరించదు. ఈ విషయంలో మీ సలహా ఏమిటి? నా కోరిక తప్పా? లేక ఆమె ఒప్పుకోవడం తప్పా?

వాకు సరియైన సలహా ఇస్తారని - ఆర్.యస్.ఆర్. ఏలూరు.

ఈ ప్రశ్న చదివేసరికి పాండయ్యకు ఎంతో హుషార్ అనిపించింది. ఈ ప్రశ్న సరిగ్గా తన మనస్సులో వున్నదే. అసలు ఈ ప్రశ్న తానే వేసిందా అన్నట్టు ఫీలై అటు ఇటు చూశాడు. పక్క సీటులో కూర్చున్న ఆ స్త్రీ తన చేతిలోని పత్రిక పూర్తికాగానే తాను అడుక్కొని చదవాలి అన్నట్టు చూస్తోంది. ఆమె ఎక్కడ అడిగితే యివ్వవలసి వస్తుందో అనుకుంటూ ముందు యిందాకటి ప్రశ్నకు జవాబు ఏం రాసివుందో చదవాలని మళ్ళీ పత్రికను తెరచి చదవసాగాడు.

జవాబు: మీ ప్రశ్నకు యింతకు ముందు వీక్లీలో జవాబు దొరుకుద్ది. అయినా ఈ విషయంలో నేను చెప్పేది భర్త భార్యను ఆవిధంగా కోరటం నేరం కాదు. భార్య అందుకు సహకరించక తప్పదు. పడకగదిలో వున్నప్పుడు భర్త భార్యను ఎలాంటి భంగిమనైనా కోరవచ్చు. అంతేగాకుండా భర్తేకాదు భార్యకూడా తనకు తృప్తికలిగే పద్ధతిలో భర్త వుండాలి అని కోరడమూ నేరం కాదు. ఈ విషయంలో ఒకరి సహకారం మరొకరికి


R.M.P. డాక్టరు కండి!

హోమియోపతి పోస్టల్ కోచింగ్ ద్వారా చదివి 6 నెలల్లో R.M.P. డాక్టరు కండి.

10వ తరగతి చదివినవారు అర్హులు

ఇండియాలో ఎక్కడైనను ప్రాక్టీసు చేసుకొనవచ్చును.

రూ. 10/-లు M.O. ద్వారా పంపిన వారికి ప్రాస్పెక్టస్, అప్లికేషన్ ఫారం పంపగలము.

డాక్టర్ ఎస్. ప్రభాకరరావు
పూలంబావి వీథి, విజయవాడ - 1

SHAH ADS

అవసరం. ఒకప్పుడు దీపం ఆర్పి సెక్స్ చేసుకునేవారట. ఈరోజుల్లో అందుకు భిన్నంగా వుంది. ఏది ఏమైనా ఈ రతికార్య(క్రమం యిద్దరికి తృప్తినిచ్చేదిగా వుండాలి. గుడ్డలు విప్పేయడానికి యిష్టపడని భార్యకు తన కోరికలను తెలియజేసి అందుకు సహకరించవల్సిందిగా వాళ్ళ్కి నచ్చచెప్పాలి. అక్కడికీ వినవప్పుడు భర్తే ఆమెను వివ(స్త్రగా చేసి ఆమెను ఈలోకాన్ని మరచేటట్టు చేయాలి. పురుషునికున్నటువంటి కోరికలే (స్త్రీకి వుంటవి.

కానీ ఆమె బయట పెట్టదు. కానీ ఆమె ముఖంలో, మాపులో, కదలికల్లో కనిపెట్టవచ్చు. అలా కనిపెట్టినడు చుకునేవారి సంసారం ఒక పూవు రెండు కాయలు. జవాబును రెండుమూడుసార్లు చదివాడు పాండయ్య. తన భార్య రాధ కళ్ళల్లో కదిలింది. తనూ తన భార్యతో యిదే కోరిక కోరాలి. తనతో సహకరించవల్సిందిగా నచ్చచెప్పాలి. ఎప్పుడు అంతగా తాను ఆమెతో మాట్లాడ లేదు. ఏదో యాం(త్రికంగా నడుస్తుంది సంసారం. కానీ ఈరోజునుండి అలా కాదు. కొంత మార్పు రావాలి.

అసలు ఈ విషయాన్ని తాను మొదలుపెడితే తనను అవహేళన చేయదు గదా? అలా చేస్తే వొళ్ళు శుద్ధికాదు. మళ్ళీ ఈ అహంకారం ఆగదు. ఇలాంటి అహంకారంతోనే ఇన్నాళ్ళూ తన భార్యతో మనసు విప్పి మాట్లాడలేక పోతున్నాడు. ఆమెతో సన్నిహితంగా వుండలేక పోతున్నాడు. రా(త్రి అడక్కముందే ముద్దాడిన కాబరేట్ గుర్తొచ్చింది. ఆ ముద్దులో ఎంత ఆనందం! మరి ఇంట్లో భార్య ముద్దు పెట్టుకోదేం? అంతేకాదు తాను ముద్దు పెట్టుకున్నట్టు గుర్తులేదు. పెండ్లైన కొత్తలో ఓసారి యింట్లో ఎవరు లేనిది చూసి తాను తన భార్య బుగ్గను కొరికినప్పుడు "ఛీ ఎంత మొరటోడివి" అన్నమాటలు యింకా గుర్తున్నవి.

ఆనాటి నుండి ఆమెను మరెప్పుడు అలా చెయ్య లేదు. మరి ఈరోజు గుడ్డలిప్పుతుంటే ఏమంటుందో పోగానే ముందు ముద్దు పెట్టుకోవాలి, ఆ తర్వాత...కండక్టర్ బెల్ కొట్టాడు.

బస్సు ఆగింది. పాండయ్య దిగి ఊరితోవ నడిచి యిల్లు చేరేసరికి మిట్ట మధ్యాహ్నం అయింది. నాయనగారు బాయిదగ్గరున్నట్టుంది. అందుకే ముందున్న పెద్ద దర్వాజ తలుపులు దగ్గరకేసి వున్నవి. తలుపులను నెట్టు కొని యింట్లోకెళ్ళి చూస్తే వడీ చప్పుడు లేదు. క్యాష్ బ్యాగ్‌ను అలమారలో పెట్టి తాళం వేసుకుని వంటగది వైపు చూశాడు. పాలదాడిలో పాలు కాగుతున్న ట్టున్నవి.

మెల్లగా యింటి వెనక పెరట్లోకెళ్ళి చూశాడు. మూలకున్న జాలరిలో తడికల చాటున గుమ్మరించుకుం టున్న చప్పుడు. ఆమె వొళ్ళు రాసుకుంటున్నట్లుంది. గాజుల చప్పుడు వినిపిస్తుంది. అందువల్ల తన రాకను గమనించినట్టు లేదు. బావి మీదున్న గంగాళంలోని నీళ్ళతో తాను కాళ్ళు కడుక్కున్నప్పుడు అయిన శబ్దానికి "ఎవరు" అంటూ తడిక మీదున్న చీరెను లాక్కొని తన ఒంటిమీద కప్పుకుంది. "ఆ! నేనే" అన్నాడు పాండయ్య.

భర్త వొచ్చినది గమనించిన రాధ గబగబ పొడి బట్టను చుట్టుకొని యింట్లోకి వొస్తూ భర్తను చూసి మరీ బిగపట్టుకుని నడుస్తూ "ఎప్పుడొచ్చారు"

"ఇప్పుడే నాయన బావి దగ్గరున్నాడా" అంటూ అడుగుతూ ఆమె పాదాల ము(ద్రల తడి గుర్తుల్లో అడుగేస్తూ నడుస్తున్నాడు.

"ఆ!" తలవెం(డ్రుకల తడి నార పెట్టుకుంటూ.

పాండయ్యకు భార్య ఈరోజు చాలా అందంగా కనిపిస్తూవుంది. ఇంతకు ముందు లేని ఆకర్షణ ఆమె నిలువెత్తున కదలాడుతూంది. ఇన్ని రోజులు తాను నిర్లక్ష్యం చేసినందుకు తాను ఎంతో బాధపడ్డాడు.

"గోదానం చేయించావా?"

"ఆ" వెం(డ్రుకల చివర ముడేస్తూ తన భర్తవైపు చూస్తూ అంది.

తన భర్త అంత తీరికగా తనతో మాట్లాడుతున్నం దులకు ఓ నవ్వుతెర పెదాలమీద కదిలింది.

"వెనక దిడ్డి దర్వాజ గొళ్ళెం పెట్టివుంది కదూ?"




"పెట్టేవుంది ఎందుకు" చీరె సింగులు పోసు కుంటూ జాకెట్ వేసుకోవడానికి తన గదిలోకి వెళుతూ అంది.

"పెద్ద దర్వాజ గొళ్ళెం నేను లోపలికి వొచ్చేటప్పుడే పెట్టొచ్చిన" ఆమెను వెంబడిస్తూ

ఏదో కొత్తదనం చోటుచేసుకున్నట్టనిపిస్తే వెనక్కు చూసింది రాధ. ఆయన తన వెంటనే వస్తున్నది చూసి తనలో తానే తియ్యగా నవ్వుకుంది.

**8**

"రాధమ్మగారు-ఓ రాధమ్మగారు" అంటూ తల్పును తోసుకుంటు, భుజానికి తగిలించుకున్న మూటను సర్దుకుంటూ వరండాలోకి వచ్చి నిల్చుంది చాకలి మంగమ్మ. లంకంత ఇంట్లో ఒక్కటే. ఎట్లుం టదో ఏమో అనుకుంటూ మూటను పక్కనే వున్న బల్లపీట మీదుంచుతూ మళ్ళీ పిలిచింది.

"ఆ వొస్తున్న-" అంటూ కొంగుకు చేతులను తుడుచుకుంటు వొంటింటిలో నుంచి వరండాలోకి వచ్చింది రాధమ్మ.

"బట్టలు తెచ్చానమ్మా జెర సూసుకుంటే నేను పోత యియ్యాల పొయ్యిగూడ రాజెయ్యలేదు. తమరే మప్ప పెడితే తిండి లేకుంటే ఎండిల్లా" అంటూ మూట విప్పి శాల్తీల సరిగ పేర్చి చూపిస్తుంది.

"ఎవకల సొడు పెట్టే వులికేది. ఇప్పుడు సబ్బు లాయే నెరి మీ ఇంటి బట్టలంటే మాకు మా భయం. తమరు ఇ(స్త్రీ కిచ్చిన చీర చూసిం(డా. నన్ను లనేరు తల్లీ మీ దగ్గర అయినట్టుంది అంటు పట్టు చీరను విప్పి చూపించింది.

"ఏమైందే"

"ఏం కాలేదు జె(ర పోగులు లేసినయి"

"నిజంగానా" అంటూ పరిశీలనగా చూసింది. అవును పయిట కొంగుకు కొంచం పక్క అన్ని పోగులు లేసి వున్నవి.

రాధకు ఒక్కసారే ఏదో జ్ఞాపక మొచ్చింది. చిరు చెమటలు చిమ్మినవి. అతి కష్టంగా జ్ఞాపకాల్ని అణుచు కుంది.

"ఇలా ఇవ్వు. నేను జాతరకు పోయినప్పుడు స్నానం చేసి ఏనుగు మీద ఆరేసిన. తీసేటప్పుడు కంపకు తగిలినట్టుంది" అంటూ మడత చేసి మిగతా బట్టల్లో కలిపేసింది.

చాకలి మంగమ్మకు ఎందుకో నవ్వు వొస్తుంది. పట్టు చీరెతో స్నానం చేయడం ఏమిటి! దాన్ని ఏనుగు మీద ఆరెయ్యడం ఏమిటి? ఎటు అర్థం గాక, ఏదో అర్థం అయినట్టు చూస్తు ముసి ముసిగ నవ్వింది.

"ఏమే మంగి నవ్వుతున్నావ్"

"ఆ ఏం లేదు దొరసాని నాకేదో మతికొచ్చి నవ్వుతున్న"

"ఏం మతికొచ్చింది"

"ఆ నేను గూడ పిల్లల కోసం అని దేవుని దగ్గర్కి, అదీ మీరు పోయిన కాడికి పోయి వుంటే" ఏవో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటు.

"మరి నీకు పోతెనే అయింద్రా?"

అవును అన్నట్టు తల వూపుతూ పెదవులను బిగపట్టి వొదిలింది.

"అంటే"

"అంటేందా దొరసాని. ఇగ అక్కడికి పోతే అయినట్టే లెక్కా?"

"ఇంకెక్కడికన్నా పోయినవా?"

"మంగమ్మ కెందుకో సిగ్గు ముంచుకొచ్చినట్టై దొరసాని కళ్ళలోకి మాడలేక తన చేతి గాజులను కదిలిస్తూ పదేండ్ల కింద తాను జాతరకు పోయింది గుర్తుకు తెచ్చుకోసాగింది.

"ఏమోనే మామగారు వెళ్ళి దీపారాధన చేసి రమ్మంటే చేసొచ్చిన కానీ, కాకపోతే మన చేతిలో ఏముందే"

మంగమ్మ మళ్ళీ నవ్వి "అంతా దేవుని చేతిలోనే. వుందంటారా"

"కాకపోతే"

"మనుషుల చేతిలో ఏమి లేదా?"

ఈసారి రాధమ్మ మౌనంగా చూస్తు నిలుచుంది.

"గాలికి దీపం పెట్టి దేవుడో అంటే ఏం లాభం దొరసాని మనిషికి పిల్లలు అయ్యే పాలు వుండాలే గానీ. మొగోని లోపల యిత్తనం వుండాలే గానీ దేవుని దగ్గరకి పోవాలనా"

"మరి నీ వెందుకు పోయిననే"

"మా వోనికి కారని నాకు తెల్సు"

"ఆ రోజుల్లో నీ కెట్ల తెలిసిందే"

"ఎందుకు తెలవదు ఐదేండ్లు కాపురం చేసినా పూవు లేదు పిందే లేదు"

"అయితే మరి ఇప్పుడెట్లా అయిరి"

"అయింద్రు అంటే!"

రాధమ్మ ఎటు అర్థం కానట్టు అనిపిస్తే దాన్నే ఆలోచిస్తు వెళ్ళి బట్టల మూట పక్కమ్మట్టే కూర్చుంటు-

"దేవుని దగ్గరకు పోతే పిల్లలైతరా మనిషికి యిత్తనం వుండాలంటేవి మా వోనికి లేదంటేవి మరెట్ల కంటివి"

ఈసారి మంగమ్మ పడి పడి నవ్వింది. నవ్వి నవ్వి కళ్ళల్లో తిరిగిన నీరును చేతి వేళ్ళతో తుడ్చుకుంటూ "అంతా మాయ దొరసానీ.మనిషి బతుకే మాయ, ఈ సంసారం మాయ, ఈ పిల్లలు మాయ"

అర్థం కానట్టు చూసింది రాధమ్మ.

"అవును దొరసాని ఆడదాని బతుకు అరటి ఆకు లాంటిది. అందుకే కొన్ని చెప్పేయి వుంటయి కొన్ని చెప్పనివి వుంటయి" అంటు పక్కనే వున్న మొగరానికి ఆనుకుంటు రాధమ్మ కళ్ళల్లోకి చూసింది. రాధమ్మ ఎంతో ఆసక్తిగా వింటూ మంగమ్మనే చూస్తుంది.

"మీరెవరికి చెప్పనంటే చెపుతా" అంటు బయటి దర్వాజా వైపు ఓసారి చూసి మళ్ళీ రాధ వైపు చూస్తు నిలుచుంది.

"ఛీ, నేనెందుకు చెపుతానే, అయినా నేను ఎవరి దగ్గర్కి పోతనని"

"నా మొగనికి తెలిస్తే యిగ నా సంసారం-"

"నాకు సంసారానికొచ్చిన ఐదారేండ్ల దాక పిల్లలు కాలేదు. ఒకనాడు మా మేనత్త ఒచ్చి ఒరే పెంటయ్య పిల్లను నా ఎంట తోలియ్యరా! తిరునాళ్ళకు తీసుకెళ్ళి దేవునికి దీపారాధన చేయించి తోలుకొస్త అట్టనన్న దానికి ఓ కాయ కాస్తదేమో" అంది.



"ఆయన పరేవన్నడు. కానీ తను రాలేదు. తిరువాలకు పోయి పూజ చేయించి, కొబ్బరి కాయలు కొట్టిచ్చి, అంత చేసినంక పొద్దుగూకే యాళ్లకు మా అత్త కొడుకు, మా బావ గూడ తిరువాలకు వచ్చిండు. వాకు గాజులు, మట్టేలు ఆయనే పెట్టిచ్చిండు. ఆ రాత్రి అక్కడే గుట్ట మీదనే బండల మీద పండుకు న్నాము.

మా అత్త బాగా గుర్రు కొడుతూ నిద్ర పోయింది. ఇక ఏం చెప్పను. మజ్య రాతిరి కాడ మా బావ "చెప్పడం ఆపి-సిగ్గు ముంచుక రాగ బొటిమ వేలితో నేలను రాస్తు, ఆ రాస్తున్నప్పుడు పడుతున్న గీతలనే చూస్తు వుంది. ఎంతో శ్రద్ధగా వింటున్న రాధమ్మ

"ఆ మీ బావ" అంటు కదిలించింది.

"మా బావ నన్ను" అంటు ఆమె కళ్ళల్లోకి చూసింది. ఆ చూపులో తనను ఏమనుకుంటుందో అన్న భావం కదిలింది.

"ఏన్ను"

"నన్ను, నన్ను-ఏమో చేసిండు"

"అట్ల చేస్తుంటే నీవేమనలేదా?"

"ఏమంట ఏమనాలని పియ్యలేదు. మీద ఒరిగినోన్ని నూకేద్దామనుకుంటుండగానే పూర్తిగా నన్ను కదలకుండా చేసిండు. ఆ తర్వాత నూకేసినా ఏం లాభం" అంటు చెప్పడం ఆగింది.

రాధ మాత్రం కదలకుండా కూర్చుంది. కానీ ఆమె మనస్సు ఆ తిరువాళ్ళలో బండల మీద తిరుగుతోంది. ఫలానా బండ మీద కావొచ్చు. ఫలానా మాదిరిగా వాళ్ళు- అన్న దృశ్యాలు ఆమెలో మెదలుతున్నవి. ఆ తిరువాళ్ళు ఆ వాతావరణం గుర్తుకు రాగానే ఆమెలో ఏదో ఏదో ఓ అలలా ఓ దృశ్యం కదిలింది.

"ఇక అప్పుడే నెల తప్పిన. మా పెద్దోడు పుట్టిండు. ఆ తిరువాలకు పోతే పుట్టిండు కాబట్టి ఆ దేవుని పేరే పెట్టిండు మా ఆయన"

ఈసారి రాధ నవ్వింది.

"ఏటేటా ఆ తిరువాలకు పొయ్యేదాన్ని ఈ ఏడే పోలేదు"

"పోయినప్పుడల్లా మీ బావ-"

ఈసారి మంగమ్మ చప్పుడు చెయ్యలేదు నవ్విందంతే.


"అంటే తిరువాళ్ళలో యిట్ల జరుగుద్దన్నమాట. అందుకేనా నా చీర కొంగు పోగులు లేసినయి అన్నవ్. నీ కున్నట్టు నాకో బావుండనుకున్నావా ఏంది ముండా?" అంటూ లేసి ఇంట్లోకి నడుస్తు వుంటే "అంత మాట అంటవా దొరసాని అదే మా దొరకేమయింది ఆయనకు పిల్ల లెందుకు కారు-అయితరు"

"ఏమైతరో ఏమో"

"ఇప్పుడు డాక్టర్లు చెపుతారట కదమ్మా పిల్లలైతందుకు మందులు యిస్తరట"

"చూద్దాం-చూద్దాం యింకో ఏడు పోనీ-"

"తెండమ్మగారు యింత అన్నం యింత పచ్చడ" అంటూ తాను వెంట తెచ్చుకున్న గుల్లలో సద్ది గుడ్డను సరి చేసుకుంది.




రాధమ్మ వంటింట్లోకి వెళ్ళి అన్నం పచ్చడ తెచ్చి మంగమ్మ గుల్లలోని గుడ్డలో వేసింది.

ఖాలీ గిన్నెలను చేత పట్టుకొని ఎందుకో మంగమ్మను చూస్తు నవ్వసాగింది.

"ఏం దొరసాని అట్ల నవ్వుతను చెప్పకుంటేనేమో చెప్పే చెప్పే అంటిరి. చెప్పినంక నేమో నవ్వితిరి. ఎట్ల?"

"నీ సంగతి చెప్పినందుకు కాదే నేను నవ్వేది. మనిషి ఇత్తనం లేక పూకనే ఎట్ల పుడతారన్నందుకు" అంటూ ఇంట్లోకి నడిచింది.

తానూ నవ్వుకుంటూ మంగమ్మ బయటకి నడిచింది.

(౯)

బావిగడ్డ మీద రావి చెట్టు కింద నులక మంచం మీద కూర్చున్నాడు సీతయ్య పటేలు. అప్పటి వరకు సీల్చిన చుట్టను మంచం కాలుకు నత్తి నల్లారుపుతూ "మీరే చెప్పండి ఎంతి న్యమంటరో" అంటు ఎదురుగా నిలుచున్న గుంపు వైపు చూసాడు. దాదాపు పాతిక మంది ఆడవాళ్ళు కొడవళ్ళను చేత పట్టుకొని నిలుచున్నారు.

"ఇయ్యాల ఒక్కనాడే కోస్తున్నామా ఏట మీ పొలం మందే మొదలైద్ది కూలీ తమరే-" మారెమ్మ కొడవలి పదును వేలితో తాకి చూస్తు. మారెమ్మ అటు ముసలిది కాదు, ఇటు వయస్సుది కాదు తన కంటే పెద్ద వయస్సు వాళ్ళు తమకు మాట్లాడరాదని కూళ్ళ దగ్గర గుత్త పెట్టుకునే దగ్గర మారెమ్మనే మాట్లాడమంటూ వుంటారు. ఆమె ఎంతకు మాట్లాడితే అంతకు చప్పుడు చేయకుండా అందరూ పనికి వంగనల్సిందే. ఆమె కుదిరిచ్చే ఒప్పందంలో నిజాయితి వుంటుం దని తన వాళ్ళకే కాదు వూళ్ళో వాళ్ళకూ తెలుసు.

మారెమ్మ కూడా చాలా తెలివిగా మాట్లాడుతుద్దీ. ఆమె ఆ వూరు ఆడ పడుచు కాదు. కన్యగ వొచ్చిన ఏ యింటి కోడలూ కాదు. మధ్యన వచ్చిన మారు మనువు. అయినా ఎవ్వరు ఆమెను అలా చూడరు. కారణం ఆమెకున్న సహజ తెలివి తేటలే!

"తలా ఎనిమిది శేర్లు ఏస్తసాండ్రి" అన్నాడు సీతయ్య పటేలు.

ఎనిమిది శేర్లు ఎండ పోస్తే ఎన్నైతవి. వాటిని దంచితే ఎన్నైతవి" అంది మారెమ్మ.

"పోయినేడు అంతే ఇచ్చినట్టు గుర్తు"

"పోయినేడు కూల్లేందుకాయే గుత్తకు కొస్తిమి"

"అయితే ఇప్పుడు గుత్తకే తీసుకొండ్రదే"

"ఏదో ఒటి తొందరగా తేల్చండి కోతకు వొంగొచ్చు పొద్దెక్కి పోతనే వుంది. అన్నట్లు మిగతా ఆడవాళ్ళందరూ పటేలు వైపు మారెమ్మ వైపు చూస్తున్నారు.

"మూడు పటేలు-కోసి, కట్టి, పట్టి యిస్తం. ఎకరమొకంటికి పుట్టడొడ్లు యియ్యండ్రి" మారెమ్మ అనగానే అంటే అన్నట్టు అందరూ నొకరిని నొకరు చూసుకున్నారు.

"ఎకరానికి నాకెన్ని పుట్లు అవుతాయని మీకు పుట్టెడియ్యాలి. అంటే మొత్తం పదెకరాల పొలానికి పది పుట్లు కావాలి ఓహ్"

"కూల్లే అయితే ఇంకా ఎక్కువ అవుతవి లెక్క చేసుకొండ్రి" అంది మారెమ్మ. సీతయ్య పటేలు ఆలోచనలో పడ్డాడు. వ్యవసాయం ఎంత నష్టొకొచ్చిందో కళ్ళ ముందు తిరగసాగింది.

"పదదు పటేలా"

"ఏం పడదు నెనకట ఈ కూళ్ళున్నయా రాజమ్మ" అంటూ ముసలి రాజమ్మ వైపు చూశాడు.

"అప్పుడు పావుశేరు అమ్మితే యింట్లోకి కావలసిన నన్ని ఎచ్చాలు వొచ్చేది మరి యిప్పుడు? మూడు సేర్ల నడ్లకు నోసేరొచ్చేది యిప్పుడు!

సెరొడ్లు అమ్మితే రూపాయి. రూపాయికేమొస్తదో చెప్పండ్రి. తమరికి తెలియనిది ఏముంది. మరో ముసలి స్త్రీ.

"అయినా అప్పుడు ఇంత పంటెక్కడిది. ఎకరానికి పుట్టి పండుం అయితే మహా ఎక్కువ" మరో స్త్రీ.

"కూలి గింజల కోసం కోసిజ్ చేయకండ్రి. రాళ్ళ వానొచ్చేటట్టుంది. కోసి పొతం చేసి యిల్లు చేరుస్తం" మారెమ్మ.

వాళ్ళ వాన అనేసరికి సీతయ్యకు అంతకు ముందేడు జరిగిన సంఘటన గుర్తొచ్చింది. వుత్తగ నోటి కాడి కొచ్చిన పంట రాళ్ళ వర్షం కురిసి సర్వనాశనమై పోయి చివరికి గడ్డి గూడ మురిగి పోయి ఏదీ చేతికి రాకుండా పోయింది. అది గుర్తొచ్చేసరికి ఒక్కసారి ఒళ్ళు జలదరించింది.

"మంచిది సాండ్రదే తొందరగా కానీయండ్రి నాలుగైదు రోజుల్లో పూర్తి సొగై యిల్లు చేరాలి"


"గుత్తకు తీసుకున్నంక కూసుంటాం దొర. సూస్తనే

వుంటరు గద-'' అంటూ తన వాళ్ళ వైపు మళ్ళీ యింటుం(డా పటేలు ఏమంటున్నడో జ(రా రెక్కలా డిచ్చి పని చెయ్యాలే అంటూ అందర్ని లెక్క పెట్టుకొంటూనే అందర్ని పొలంలోకి నడవ మంటూ సైగ చేసింది. అందరూ ఆమె సైగను పాటిస్తు' గోసులు పోసుకుంటు మళ్ళల్లోకెళ్ళి కోతకు వంగారు.

పొలం కోస్తున్న ఆడవాళ్ళను చూస్తున్న సీతయ్య పటేలుకు గత కాలం కళ్ళ ముందు తిరగసాగింది. తన వయస్సులో వరి కోతలప్పుడు వొరం మీద నిలుచొని వరికోసే జనంతో పరాచికాలు ఆడుకుంటూ వరి కోయించేది.

అప్పుడు ఓ మూడెకరాలు పెడితే మహా ఎక్కువ. మానెడు కూలీ అప్పుడు ఆడవాళ్ళతో పాటే మగవాళ్ళు కూడా వరి కోసేది. మగవాళ్ళకు మూడు తువ్వలు- ఇప్పుడు మగవాళ్ళేరి? అందరూ బొంబాయికో, దుబాయ్‌కో పోయి చేరిన్(డు. ఆడవాళ్ళేమో మొగుళ్ళు పంపే డబ్బును తినుకుంటు కూలీ నాలీని మానేస్తున్నారు. 'ఇలా అయితే ఒహ్!'- ఆ రోజుల్లో జనం ఊరు ఊరంతా తరిలొస్తే ఆపేది కష్టం వుండే ఎంత మార్పు? కాలం యిక మునుముందు ఏం కానుందో అనుకుంటూ కోసే జనం వైపు చూస్తూ కూర్చున్నాడు.

మంచెంబులో మజ్జిగ తీసుకొని కోడలు రాధ




అక్కడికి వొచ్చి నిలుచుంది.

''ఏమ్మా నీ వొచ్చానవు, వాడు ఒచ్చేటప్పుడు పట్టుక రాలేకపోయిండా?''

''ఆయనగారు భూమి సంచులను సరి చేయిస్తున్నాడు మామయ్య''

''అల్లనే ఆ గరిసెని, గుమ్మాలను దులిపించవల్సింది''

''వాటిని నిన్ననే చేయించాం'' అంటూ నిలుచున్న కోడలి వైపు చూశాడు. ఆమె వరి కోస్తున్న ఆడవాళ్ళ వైపు చూస్తోంది. బంతి పూవులాంటి తన కోడలుకు ఇంతవరకు పిల్లా జెల్లా కానందుకు ఎంతో బాధ పడి పోతూ, తన వంశం ఇంతటితో ఆగుతుందా! లేదు లేదు భగవంతుడు తప్పక తనింట్లో పసిపాపల బోసినవ్వులు వినిపిస్తాడు- అంటూ ఓ దీర్ఘమైన శ్వాస వదిలాడు. వరి కోస్తున్న జనం ఒక్కసారే నిలుచొని బావిగడ్డ వైపు చూస్తున్నారు. మారెమ్మ మాత్రం రాధను రమ్మని సైగ చేస్తూ చేయి వూపుతోంది. అందరూ రమ్మన్న ట్లుగా యిటువైపే చూస్తున్నారు.

అది గమనించిన మామగారు ''పోయిరా పో-అల్లం' దరూ చూడటానికి పిలుస్తున్నారు.''

బావి గడ్డ దిగి, కాలువ దాటి, వొరి కోస్తున్న మడి వొరం మీద నిలుచుంది.

''ఏం రాధమ్మగారు. అక్కన్నించే పోతున్నావు. ఇందాక వొచ్చేది లేదా?''

''నేనూ వొద్దాం అనుకుంటునే వున్నా. ఇంతలోనే పిలిచారు'' పంటచేను వున్నంత లెక్కన తన దృష్టిని. పోనిస్తూ అంది.

అందరూ కోతనాపి రాధను, ఆమె కట్టుకున్న



చీరను, పెట్టుకున్న గాజుల్ని చూస్తున్నారు. ఆమె ఒంటి రాయి ముక్కు పుడక మీద పడ్డ సూర్య కిరణాలు తళుక్కుమని వెలుతురులో కలిసిపోతున్నవి.

"దేవునికి దీపారాధన చేసి వొచ్చినవట కద. తప్పక కొడుకు పుడతాడు" అంటూ ఓ చేతిలో కొడవలి, మరొక చేత వారికర్రలను పట్టుకొని నిల్చున్న మారెమ్మ రాధమ్మ ముఖంలోకి చూస్తూ అంది.

రాధమ్మ మారెమ్మ వైపు చూస్తు, సిగ్గు పడి నవ్వుతోంది. మారెమ్మను చూడగానే తాను దేవాలయం గోడకు చూసిన శిల్పం గుర్తొచ్చింది. ఆ శిల్పం అచ్చం ఈమె లాగుంది. బలిష్టమైన శరీరం, సన్నని నడుముకు గుండ్రని పిరుదలు, ఎత్తైన రొమ్ములు, వాటి లావును కొలుస్తున్నట్టుగా ఆమెను కౌగిలించుకున్న మొగవాడి చెయ్యి, మరొక చెయ్యి ఆమె లోతైన బొడ్డు కింద భాగాన్ని, అరమోడ్పు కనులతో ఆమె అతని కౌగిలిలో యిమిడి, అతని విశాలమైన ఎదపై తలవుంచి, అతని పెదాలకు తన పెదాలనుఆనించి, వొకరి తొడలకు మరొకరి తొడలు అతుక్కుపోయి- అబ్బా అసలు ఆ శిల్పాన్ని ఆ దేవాలయం గోడకు ఎందుకు చెక్కారో అనుకుంటూ నిలుచున్న రాధమ్మ మారెమ్మ మాటలతో ఈ లోకంలో కొచ్చింది.

"కొయ్యండ్రి, కొయ్యండ్రి ఎండెక్కిపోతుంది!" అంటూ వొంగినప్పుడు జ్ఞాపకాలు చెదిరిపోయినవి.

10

ఆ రాత్రి ఆ వూరు నిద్రపోలేదు. ఆ రాత్రేకాదు అంతకు ముందు మూడు రోజుల నుంచి గూడా సరిగా ఎవరికి నిద్రలు లేవు. జనం అంతా ఒకటే తాగుడు. ఆ ఊరిలో వొడిసినకల్లంతా తాగారు. ఊరికొచ్చిన సారంతా తాగారు. ఆడవాళ్ళు తాగారు. పిల్లలకు తాగించారు. తాగి అందరూ భయాన్ని మరిచే ప్రయత్నం చేస్తున్నారు. తాగినప్పటి మత్తుకునుకు తప్ప ఎవ్వర్కి నిద్రరావడం లేదు. పెద్దల ముఖంలో భయం, పిల్లల కళ్లల్లో భయం.

తెల్లవారంగ ఆ ఊరు, వాడల్లోని కాస్త విశాలంగా వున్న స్థలాల్లో గుమిగూడి, ఒకే ఆలోచన, ఒకటే చర్చ అదే భయం గూర్చి.

నడివయస్సు దాటిన వాళ్లు చుట్టలు ముట్టించుకొని ఒక్కొక్కరు సీతయ్యపటేలు ఇంటి వాకిట్లో గుమిగూడుతున్నారు. అంతకుముందే సీతయ్య పటేలు తెల్లవారు జామున మరికొంత మంది ఇంటి చుట్టుపక్కల వాళ్లనులేపి తన పందిట్లో ఓ కుంపటి వెలిగించి కూర్చున్నారు, అందరి తలల్లో అదే ఆలోచన అందరి గుండెల్లోను దాని గూర్చిన గుబులే!

ఇంతకు ముందు రోజులలో ఇలాంటి దెప్పుడైనా పడి వుండొచ్చునా అంటూ అడుగుతూ సీతయ్య పటేలు వైపు చూశాడు గొండ్ల మల్లయ్య.

"ఏదోమే, నా ఎరుకల ఇదే - నేను చూడలేదు. వినలేదు"

"అంటే ఈ పడేది ఎందన్నట్టుసుక్క జారిపడతదా! మొగులు ఇరిగి పడతదా!! లేకుంటే సూర్యుడు నిమున్న నిప్పులు రాల్చతడా? ఆఖర్కి ఏది పడదన్నట్టు? అది పడంగానే ఆమెదల కొద్దీ మసి అయిపోద్దిలే?" అంటూ అడిగాడు గ్రామ మస్కూరి శివలింగం. శివలింగం రాత్రనకా, పగలనకా ఊళ్లో తిరుగుతూనే వుంటాడు. అతని చేతికర్రకు బరిసె బిగిచ్చి వుంటుంది. అది వున్నందుకు అతన్నిఎవరు ఏమీఅనరు. అది వున్నందుకు అతను తన చేతిలో ఆయుధం వుంది అని తృప్తిగా నిర్భయంగా తిరుగుతాడు.

అందరు ఆలోచనల్లో మునిగివున్నారు. ఎవ్వరు విని పించుకునేటట్టులేరు. అప్పుడే ఇంట్లో నుంచి వొస్తున్న పాండయ్య తండ్రికి కొంచెం దూరంగా అర్గుమీద కూర్చుంటు శివలింగం మాటలు విన్నట్టుంది జవాబుగ "అది సుక్క పడడంకాదు. అది భూమి మీదినుంచి మన మనుషులు పంపిన ఓ ప్రయోగశాల, దాన్ని స్కైలాబ్ అంటారు. అనుకున్న పనులు అయినాక అది అసలు సముద్రంలోనే దిగేటట్టు ఏర్పాటు చేశారట. కాని మరి ఏం జరిగిందో ఏమో అది సముద్రం మీద దిగక వూర్లమీద పడతదని అంటున్నారు" అన్నాడు.

"ఏదో బిస తప్పినట్టుంది. మన ప్రాణాలు తీస్తుంది" అంటూ ఓ బరువైన శ్వాస తీశాడు మల్లయ్య.

"ఈ నాలుగైదు రోజుల నుంచి ఊరంతా తిరిగి చూస్తున్నా ఎవరి మొఖాల మీదగింత కళలేదు. నేరీ నిన్నటి నుంచి అందరి మొఖాల మీద సావుకళ కని పిస్తుంది" అంటు తలను మొకాళ్ల మీద ఆనించి భయంగా బాధగా శ్వాస ఒదిలాడు మస్కూరిశివలింగం. ఈ రోజెందుకో శివలింగం మీసాలు వాడిపోయిన కొత్తిమీరలా వున్నాయి. వాటిని మెలేసి ఏడిచే చంటిపిల్లల నోరు మూయించే వాడు. బడికి పోనని ఏడిచే వాళ్లను క్లాసుల్లోకి వెళ్ళే వరకు వురికిచ్చేవాడు. దానికి ఫలితం వాళ్ల తల్లి తండ్రుల నుంచి ఇంత పొగాకు లేదా బీడి.

"ఎన్నడైనా చావుతప్పదు. అదిగాక ఒకరు చస్తె ఒకరు బతికుంటే వున్నోళ్లకు బాధ. అందరం చస్తనే వున్నాం. కాబట్టిఎవరికి నిబాధ వుండొద్దుభయపడొద్దు" అన్నాడు సీతయ్య పటేలు.


"భయపడి చేసేదేముంది" మల్లయ్య.

"అందుకే నిన్నటి నుంచే జనం ఒకటే తిండి! ఒకటే తాగుడు? ఈయాల్ల పొద్దూకే వరకు వూళ్ళో ఒక్క కోడిమిగలదు" శివలింగం.

"కోళ్లేంది - యాటలు! ఎన్ని తెగుతున్నాయి అను కుంటుండ్రు" మల్లయ్య

"కల్లు, సారా, చాలకబీరు, బ్రాంది, విస్కీ తెచ్చుకుని తాగుతున్నారు" అంటూ పాండయ్య తండ్రి వైపు చూశాడు. తాను ఇప్పుడు కూడ తాగే వున్నాడు. అందుకే ఎవరుపసిగట్టకుండా దూరంగా కూర్చున్నాడు.

ఏదో కాస్త తీసుకుంటే ధైర్యంగా వుండొచ్చు అని, ఈ బతికిన రెండ్రోజులైన తిని తాగాలని అందరూ "సీతయ్య పటేలు మాట పూర్తికాకముందే - ఆ చావు పండగ చేసుకుంటుండ్రు అంటు శివలింగం తన జేబులోని సారా సీసాను తడిమిచూసుకున్నాడు. సీతయ్య పటేలు కూర్చున్న అరుగు పక్కనే వాళ్ల పెంపుడు కుక్క ముందరి కాళ్లను చాచి వాటిమీద తలను ఆనించి అప్పుడప్పుడు అదోమాదిరిగా కలతగా కుదులుతూ ఆయాసంగా గొనుగుతూ అందరి మొఖాలను చదువు



తున్నట్టుగ పడుకుని చూస్తుంది. దాని చూపులో మాత్రం ఏదో బెదురు వుంది. అదీ మనుషుల భయాన్ని పసిగట్టినట్టుంది. అది ఆందోళన పడుతుంది అక్కడికి కొద్ది దూరాన వున్న కంప చెట్టు మొదట మరొక బక్క చిక్కిన కుక్క పడుకుని వుంది. మధ్య మధ్య అవి ఒక దానిని మరొకటి చూసుకుంటు కుయ్, కుయ్, మని మూల్గినట్టుగ శబ్దం చేస్తున్నవి.

పూర్తిగా తెల్లవారి తూర్పున సూర్యుడు భూమి మీద నుంచి ఆకాశానికి ఎక్కి వొస్తున్నాడు. రంగడు చిన్న బిందెనిండా పాలు [illegible]కుని రాధమ్మ గార్ని పిలుస్తు ఇంట్లోకి వెళ్లాడు. అంత వరకు అక్కడ కూర్చున్న వాళ్ళు లేచి చావిడి వైపు నడిచారు.

ఊకి పల్లడంఆపి ఆడవాళ్లు గుసగుసలుగా మాట్లాడు కుంటున్నారు. "అది నాశనం కాను సరిగా మన ఊర్లమీదనేపడతదట. అది పడ్డ చుట్టు పక్కల ఎన్నో ఆమడల దూరం మసి అయి గడ్డికూడ మొలవదట" అంది ఓ నడివయస్కురాలు. కుడిచేతిని కడుపుచుట్టూరా పెట్టి ఎడమ చెయ్యిని గదమకింద ఆనించి కళ్లల్లో, ముఖ కవలికల్లో భయాన్ని, ఆశ్చర్యాన్ని ప్రదర్శిస్తూ.

పశువులను అడవి వైపు ఒదిలి పసులకాడి పిల్లలు బజార్లో బీడీలు కాలుస్తు ఆనాడు రాబోయే చావు గురించే మాట్లాడుకుంటున్నారు. పసుల వెంట పేడ కోసం వెళ్లి తిరిగొస్తున్న ముదుసలి ఆడవాళ్లలో చేతుల్ల పేడతట్టలతో తిరిగొస్తున్న తొమ్మిది, పదేళ్ల ఆడపిల్లలు అవ్వల్ని అడుగుతున్నారు. అందరం ఈయాల్ల రాత్రి సస్తాంకదూ అంటూ కాలాన్ని చూపి చావుకు దగ్గరైన ముసలివాళ్లు సస్తే ఏంది అంటున్నారే కానీ అడిగే పిల్లల బంగారు బతుకుల గూర్చి ఆలోచించినట్టు కనిపించడం లేదు.

కొందరు ఆరోజు పశువులను, మేకలను అడవికి ఒదలడం మానేశారు. కోళ్లను గూటినుంచి వొదలడం లేదు. స్కైలాబ్ పడుద్దో లేదో మనుషులు సస్తారో లేదో కానీ ఆ రోజు మాత్రం తప్పకుండా ఆ కోళ్ల తలలు తెగడం ఖాయం. అందుకే వాటిని ఒదలకుండా గూళ్లల్లోనే కమ్మి వుంచారు. అక్కడెక్కడో వూరవతల కాలువ పక్కన ఓ పంది చావు అరుపు. బజార్లలో గాడిదలు మాత్రం ఒకదాన్ని మరొకటి తరుముకుంటు పరిగెత్తుతూ ఓండ్రు పెడుతూనే వున్నాయి. ఊరి మొదటి ఇంటి వెనుక రోడ్డు పక్కన వున్నపెంట కుప్పలో అప్పుడప్పుడే వస్తున్న తన కొమ్ములతో కుమ్మి పెంట దిబ్బను చిమ్మితే మన్నంటిన ముఖాన్ని లేత ఎండను పరచుతున్న సూర్యుని వైపుంచి వాలిక చాచి నోరు తెరచి ముసకొడుతుంది ఓ దున్న. ఆరోజంతా పూజలు చెయ్యాలి. సాకలు పెట్టాలి అని డప్పు చాటింపు చేశారు. కులాల వారిగా ఆ వూరి వాడలో వాళ్ల వాళ్ల దేవుళ్లకు పూజలు మొదలైనాయి. గొల్లలు మల్లన్న దేవునికి, కురుమలు బీరప్పదేవునికి, గౌండ్ల వాండ్లు కాటమయ్యకు, అరిజనులు ఎల్లమ్మ దేవతకు ఏటలను, కోళ్ళను కోస్తున్నారు. కల్లుకుండలను ఆర పోస్తున్నారు. ఊరంతా డప్పు చప్పుళ్లతో భాజా భజంత్రీలతో మారు మోగిపోతుంది. ఒక్క ఆ వూరే కాదు. చుట్టు పక్క


పసి వెన్నెల
సఖచిత్రం: కాళీపట్నపు కృష్ణారావు, మురపాక

పూర్లలో కూడా అంతే భయం పండగ జరుగుతుంది. మనకున్న దేవతలందర్కి సీతయ్య పటేలు రామాలయం దగ్గర అర్చన చేయిస్తున్నాడు. పాండయ్య పూజారులకు కావలసిన పూజా సామాను సమకూర్చడంలో నిమగ్నమై వున్నాడు.

రాధమ్మ, పూజారి భార్య సావిత్రమ్మ ఇద్దరు గంధం తీస్తు కూర్చున్నారు. మైకులో పూజారి చదివే శ్లోకాలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"మా వారు శ్లోకాలు చదివితే దేవుడు ప్రసన్నుడై పూరిని సుభిక్షంగా వుంచుతాడు" అంది రాధవైపు చూస్తు.

రాధమ్మ మాట్లాడలేదు. రాసిన గంధాన్ని గిన్నెలోకి ఎత్తుతూ వుంది. అసలు పూజారులంటేనే రాధమ్మకు వంటి మీద జెర్రులు పాకినట్టైతవి. పూజలు, వాళ్ళునడిపే తంతులు అన్నీ ఆమెకు ఓ వికారాన్ని పుట్టిస్తవి.

"ఈ వూరుఅంతో ఇంతోఓ మాదిరిగాసురక్షితంగా వుందంటే మావారి పూజా ఫలమే" అంది సావిత్రమ్మ చూపుల్లో ఓ మాదిరి గర్వాన్ని విసురుతు.

రాధమ్మ ఓ మాదిరిగా మౌనంగా నవ్వింది.

"ఈ అరిష్టం రానున్నదన్ని మావారు ముందే కని పెట్టారు. వారం రోజుల క్రితమే మా మేనమామగారు కూడా వచ్చి పంచాంగం అవన్నీ చూసి అవునమ్మ మీ వూర్ల మీదికి పెద్ద అరిష్టం రాబోతుంది అన్నారు మా వారితో. నేను అప్పుడే అనుకున్నా-"

"పంచాంగంలో ఈస్కైలాబ్ పడనున్నదని వుందం టారా?" అంత వరకు మౌనంగా వున్న రాధమ్మ అంది.


"ఆ వుండదు. వుంటుంది. మా మావగారు ఈ వూరికి శాంతి చేకూర్చుటకు ఏదో మా వారికి మరి మరి చెప్పి వెళ్ళారు. ఆ రోజుపూజలు జరుగుతున్నాయి. మనిషి తాను బతకడంకోసం రాయిని పూజిస్తున్నాడు. పామును పూజిస్తున్నాడు.పందిని పూజిస్తున్నాడు. గాలిని పూజిస్తున్నాడు. నిప్పును పూజిస్తున్నాడు. నీటిని పూజి స్తున్నాడు. ఈ పూజలకు కారణం భయం. మనిషిలో భయం వున్నంత వరకు ఈ పూజలు తప్పవు.

"మీ తల్లిగారిదే వూరన్నారు" ఆ విషయంలో ఎక్కువగా మాట్లాడం ఇష్టంలేి రాధ మాట మార్చింది.

"రాజమండ్రి" అంటు రాధ ముఖంలోకి చూస్తూ గంధపు చెక్కను సానకు రాయడం ఆపి అంది.

"పిల్లలెందరు"

ఆమె చప్పుడు చేయలేదు.



ముప్పై ఐదేళ్ల ప్రౌఢకి ఇంతవరకు పిల్లలు కానందుకు. రాధకు కొంచెం ఆశ్చర్యం కలిగించింది. పెద్ద పెద్ద కనుగుడ్లు చుట్టూర కాటుకదిద్దిన కళ్ళు ఇత్తడి కరిగించి పోత పోసిన బొమ్మలాంటి విగ్రహం. వొదులుగ ముడి వేసిన తలవెంట్రుకల కొనలు. రవికకు, చీరకట్టిన మధ్యన ఖాళీ స్థలాన్ని కానరాకుండా పరచుకున్నాయి.

"పంతులు గారు అదృష్టవంతులే" అంది రాధమ్మ ముసి ముసిగానవ్వుతు.

"ఎందుకు" అంటురాధకళ్ళల్లోకి చూసింది పూజారి భార్య.


రాధమ్మ మళ్ళీ చిలిపిగ నవ్వింది. సావిత్రమ్మలో అనుకోని సిగ్గు ఆవరించగ వక్షస్థలం మీది కొంగును సరిచేసుకుంది.

"మీది ఈ వూరేగదా! మీ వూరి పూజారి గారి మొదటి భార్యకు కూడా పిల్లలు కాలేదటగ" రాధ మాట్లాడలేదు.

"పిల్లలు కావడం గూడ స్త్రీకి ఓ వరం" అంది సావిత్రమ్మ.

"మీ పంతులు గారు రాబోయే అరిష్టాన్ని ఆపుతారు అన్నారు, మరి తనకు పిల్లలు..." అంటు మధ్యనే ఆపేసింది.

పూజారి భార్య మౌనంగానుదుటికి పట్టిన చెమటను ఎడమ భుజంమీదికొంగుతో అద్దుకుంది. అప్పుడెందుకో




ఆమె కళ్ళల్లో కాంతి తగ్గి కనురెప్పలు కాస్తవాలినట్టు కనిపించాయి.

"చెట్టు వల్ల మరో చెట్టు పుట్టినట్టే, జంతువువల్ల మరో జంతువు పుట్టినట్టే, మనిషి వల్ల మరో మనిషి పుడతాడు గానీ - మంత్రాలకు, పూజలకు పుట్టరను

కుంట" అంది రాధ గంధం తీయడం ఆపి పూజారి భార్యవైపు చూస్తూ గంభీరంగా.

అంతవరకు తన భర్తను గూర్చి, భర్త చదివే శ్లోకాల గూర్చి, చేసే పూజల గూర్చి గొప్పగ చెప్పిన తాను ఏం మాట్లాడాలో తోచక "మీకూ పిల్లలు కాలేదటగ" తలవంచుకొని అంది.

అవును అన్నట్టు తలవూపింది రాధమ్మ.

"నేనుభారత భాగవతాలు చదివాను"

"నేను విన్నాను"

"ఈ పిల్లలు కాకపోవడం ఈనాటిసమస్యే మాత్రం కాదు. ఏనాటినుండో వొస్తుంది."

"అవును"

"పాండవుల పుట్టుక"

రాధ మాట్లాడలేదు.

"కుంతి కూడ కర్ణుణ్ణి - "

రాధ నవ్వింది.

"వున్న మాట అంటే నవ్వుతావెందుకే పిల్లా" అంటు రాధ బుగ్గను గంధం చేతితోనే గిల్లింది.

"వాళ్ళందరు పూజలందుకుంటున్నారీ నాడు"

"ఎందుకందుకోరు. ఏండ్లు గడిస్తే దయ్యం దేవుడౌతాడీలోకంలో"

"రాధమ్మగారూ! పటేలు రమ్మంటున్నారు" అంటు దర్వాజకు కొంచెం దూరంలో నిలుచుని అన్నాడు



రంగడు.

రంగనివైపు చూసినసావిత్రమ్మ మనస్సులో "దున్నపోతులాగున్నాడు" అనుకొంటూ" మీ పాలేరా" అంది.

అవునన్నట్టు తలవూపి లేచినిల్చుంది రాధమ్మ.

"పొద్దువుగానీ ఈ రాత్రి ఎట్లాగడుసుద్దో ఏమో పాడై. ఇద్దరం మొద్దుల్లా చావాలి. మా ఆయన గుర్రు పెట్టుకుంటు పడుకుంటాడు. నాకేమో నిద్రపట్టదు.

రాధమ్మ మౌనంగానే చూస్తూ నిల్చుంది.

సావిత్రమ్మ రాధమ్మ చెవి దగ్గరకొచ్చి "చూడు రాధమ్మ మీమామగారికి చెప్పి ఈ మీ పాలేరును రాత్రికి మా ఇంటికి పంపియి. కాస్త తోడుంటాడు ఎక్కడైనా చచ్చేదే కదా చస్తే అందరం కలిసి చస్తాం బతికితే అందరం కలిసి" అంటు మధ్యలోనే ఆపి రంగని వైపు చూసింది.

"మా మామగార్ని మీ పంతులుగారితో అడిగించి పిలిపించుకోండి" అంటు నవ్వుతూ కదిలింది రాధమ్మ.

"కొంటే పిల్లా నవ్వుతా వెందుకు బతికితే రేపు ఈ వూరికి పూజారి వుండొద్దా?" అనేలోపే అక్కడినుంచి రాధమ్మ పోయింది.

గుడిలో మంగళ వాయిద్యాల చప్పుడెక్కువైంది. "అమ్మగారూ! అయ్యగారు గంధం తెమ్మంటున్నారు" అంటు ఓ కుర్రాడొచ్చి గంధపు గిన్నెను అందుకుని వొచ్చినంత వేగంగా వెళ్లాడు.

సావిత్రమ్మ గర్భగుడివైపు నడిచింది. ఆమెకళ్లనిండా కోరిక కాంతులు, వంటినిండా శృంగారపు తరంగాలు. రోజంతా పూజలు జరిగాయి. సాకలు పెట్టారు బలులు ఇచ్చారు, తాగారు, తిన్నారు, ఆడారు, పాడారు ఏదో మొండి ధైర్యం అందరి భయాన్నిన అణిచి పెడుతోంది. చీకటి పడుతోంది.

భయంతో ఆందోళనతో, అతిభయంకరంగా రాత్రి అతికష్టంగా గడిచి తెల్లారింది. సూర్యుడు ఎప్పటిలాగే ఉదయించాడు. ఊరు ఎప్పటిలాగే బాగానే వుంది. కాని ఏ ఇల్లు తలుపు తెరచుకోలేదు. కనీసం తెల్లారుతుంది అని తెలియ పరచడానికి ఆ వూళ్లో ఒక్క కోడిపుంజైనా బతికి వుంటేగదా!

స్కైలాబ్ పడింది. కానీ ఆ వూళ్ల మీద కాదు. ఏ వూరికి హాని జరగని చోట సముద్రంలోనే పడింది. స్కైలాబ్ పడడానికి ఆ వూళ్లలో జరిగిన పూజలకు ఏ సంబంధం లేదు. తెల్లారివాక మా పూజ వల్లనే మన వూర్ల మీద పడకుండా పోయిందని అన్నా అనవచ్చు. వాళ్ల పూజలందుకోవచ్చు. పచ్చి అజ్ఞానం వున్నన్నేళ్ళు మోసం బతుకునే వుంటుంది. మొత్తంమీద అది పడుతుందన్న భయంతోఆ నాలుగురోజులు వాళ్ళు చేసిన కార్యక్రమాల వల్ల ఆ చుట్టు పట్ల వూళ్ల పదేండ్ల అభివృద్ధి పట్టు తప్పింది.

మొత్తం మీద ఆలస్యంగ ఆ వూరు నిద్రలేచింది.

## 11

ఓనాడు తెల్లవారు జామున బాలసంత వాని చప్పుడు. తెంపులేస్తుండా వొస్తుంది. మధ్యమధ్యన శంఖు ఊదిన శబ్దం. శంఖు ఊదినప్పుడల్లా కుక్కలు అరుస్తున్నాయి.



బుజ్జగింపు

నఖచిత్రం: కాశీపట్నపు కృష్ణారావు, మురపాక

శంఖు శబ్దానికో కుక్కల అరుపులకో గానీ సీతయ్య పటేలుకు మెలుకువొచ్చింది. లేచి మంచం మీద కూర్చొని చుట్టను వెలిగించాడు. అతని తలనిండా గడచిన తన జీవిత గాథలుకదిలాయి. రాబోవు బాధలు మెదిలాయి. తన తరువాత ఈ ఆస్తి తన కొడుక్కి, ఆ తరువాత నో ? -

ఎందుకో సీతయ్య పటేలుకు కళ్లల్లో నీళ్లు నిండినవి. గుండెలో చేయి పెట్టి కదిపినట్టనిపించింది. తనకొడుకు కూడ అనుకున్నంత ప్రయోజకుడు కానట్టుంది. ఇంకా నయం ఈ మధ్యకోడలి పిల్లతో కాస్త మంచిగ మసలుతూ ఇంటి పట్టున వుంటున్నాడు అదే మహాభాగ్యం. అదో ధర్మతల్లి ఈ ఇంటి లక్ష్మి. సంసారంలో అత్తను మించినదని పిస్తుకుంటది. దాన్ని కన్నతల్లి కడుపు సల్లగుండ! అది ఇంట్లో తిరుగుతుంటే దీపం నడిచినట్టుంది. లక్ష్మి దేవి కదలినట్టుంది.

ఈలోపున బాలసంతవాడు ఇంటి ముందుకొచ్చి తన వంశాన్ని ఆ వంశానికి వున్న ధర్మగుణాన్ని పొగుడుతున్నాడు. ఇంటి వెనక వరండా పక్క మల్లెపందిరి కింద పడుకున్న రాధమ్మను బాలసంతవాని గంట చప్పుడు లేపింది.

ఆమె కళ్లు తెరచి పక్కకు చూసింది. గుర్రుపెడుతూ గాఢనిద్రలో ఆమె భర్త. మంచం మీద నుంచి లేవబోయి మళ్ళీ ఒంగి భుజంపట్టి గుంజిన భర్తవైపు చూసింది. అతను గుర్రు పెడుతూనే వున్నాడు. ఆమె కొంగు మాత్రం అతని భుజం కింద వుంది. మెల్లగ అతన్ని జరిపి తన కొంగును లాక్కొని లేచి ఇంట్లోకి నడిచి దూలానికి వేలాడుతున్న కందిలి బత్తిని పెంచింది. ఇల్లంత వెలుతురు పులుముకుంది.

బాలసంతవాడు పొగడుతూనే వున్నాడు. రాధమ్మ తల్లితండ్రిని గుర్తు చేస్తున్నాడు. వాళ్లమ్మ ఎంతటి ధర్మతల్లో చెపుతున్నాడు. ఆమె చాటతో చాటెడు పెట్టే భిక్షాన్ని గుర్తుచేస్తున్నాడు.

రాధమ్మ చాట తీసుకుంది. అందులో వడ్లను తీసుకుంది. బయటి దర్వాజ దగ్గరకు నడిచివెళ్ళి తలుపు తెరచి ఎదురుగ నిలుచున్న బాలసంతవాడి జోలెలోపోసింది.

గంట చప్పుడు ఆగింది.

"నల్లని తల్లి కలకాలం బ్రతకాలి. కడుపు నిండా కనుక్కొని కోటికి పడగెత్తాలి. మీ అత్తదేవకమ్మ సచ్చి స్వర్గాన వుంది గాని ఆమెది మహా దొడ్డచెయ్యి" అంటూ మళ్ళీ గంటను కదిలించాడు. శంఖును ఊదుతూ కదిలిపోయాడు. తలుపు గడియవేసుకుని లోనికి నడుస్తూ పక్క వరండాలో మంచంమీద కూర్చున్న మామగార్ని చూసి ఆగి "ఏమిటి మామయ్యా ఏదో ఆలోచిస్తున్నారు" అంటూ కొంగును కప్పుకొని నిలుచుంది.

"ఏం లేదమ్మా ఏదో వాడు మీ అత్తయ్యను గుర్తుచేస్తే..." అన్నాడు కాలుతున్న చుట్టను మంచం కాలుకు వొత్తి ఆర్పేస్తూ.

నేను దురదృష్టవంతురాలిని. కనీసం ఆమెను చూసే భాగ్యం కూడా లేదాయే. ఆమె వుంటే ఈ ఇల్లు కళే వేరుగా వుంటూ వుండేది."

"ఏదీ మనం అనుకున్నట్టు కాదమ్మా అంతా వాడిలీల" అన్నప్పుడు రాధమ్మ చాటతో నేలను తాకుతూ నిలుచుంది.

"వెళ్ళి పడుకోమ్మా"

మౌనంగా నిలుచుంది.

ఎక్కడో కోడిపుంజు కూసిన శబ్దం.

"మామయ్య ఓ వారం రోజులు మా అమ్మ వాళ్ల ఇంటికి పోయి రావాలనివుంది"

"మీ అమ్మనే పిలిపించుకుంటేపోలే"

రాధ మాట్లాడలేదు.

"వాన్ని అడిగావా"

"ఇంకా ఆయన్ని అడగలేదు"

"వానికి గూడ చెప్పి పోయిరా"


"పని మనిషి వచ్చి పాచిపనులు చేసి పోద్ది... ఇక వొంట కొచ్చింది- "

"ఆ అదేం లేదు. మన పక్కింటి జానకమ్మ వుందిగ, వాళ్లు వండి పంపిస్తారులే. పచ్చళ్ళు అవీ వున్నాయిగా ఏదో సర్దుకుంటాంలే"

"అయితే నేను రెండు రోజుల్లోనే తిరిగొస్తా" అంటూ లోనికి నడిచింది.

## 12

పెద్ద దర్వాజను దాటి లోపలికొస్తున్న రాధను చూసిన ఐదేళ్ళ జ్యోతి "అత్తయ్యొచ్చే అత్తయ్యొచ్చే" అంటూ లోపలికి పరిగెత్తి యింట్లో తల్లికి నాయనమ్మకు చెప్పి వెళ్ళినంత వేగంగ వొచ్చి మళ్ళి అత్తయ్యను కలుసుకొని వేలు పట్టుకుని యింట్లోకి నడిపించుకొస్తువుంది.



వెనకాల లగేజీతో
గుర్రపు బండి రాజయ్య.

రాధ తల్లి అనసూయమ్మ ఎదురొచ్చి బిడ్డ తలను ముఖాన్ని రెండు చేతులతో నిమిరి "నా తల్లె రా" అంటూ యింటి వెనక్కు తీసుకెడుతు "జ్యోతి అత్తయ్య కాళ్ళు కడిగించుకురా" అని చిన్నదానికి చెప్పి వంటింట్లోకి తొంగిచూపి అన్నం వార్చుతున్న కోడలి నుద్దేసించి "సావిత్రి, రాధమ్మ వొచ్చిందే"

"వొచ్చిందా వస్తున్నా" అంటూ అన్ని సర్ది బయటికొచ్చింది.

కాళ్ళు చేతులు కడుక్కొని వొస్తున్న అత్త కోడళ్ళను చూసి " యిప్పటినుండే అత్తగారికి సేవలా" సావిత్రి బిడ్డవైపు చూస్తు.

"ఎవరికోసం" అంది అనసూయమ్మ మనవరాలి వైపు తృప్తిగా చూస్తు.

"ముందు ముందు ఎలాగో చేయడం కుదరదు. ఇప్పుడు చేసిందే దక్కేది"

జ్యోతికే అర్థం కాలేదు.

రాధ జ్యోతి తలను నిమురుతు నిలుచుంది.

"అత్తయ్య నీ బిడ్డ ఈసారి కాస్త వొళ్ళు చేసిన ట్లుంది. కాస్త బుగ్గలు గూడా లావెక్కినయి" అంటూ కవ్వింపుగ రాధ కళ్ళల్లోకి చూసింది సావిత్రి. ముందు అమ్మాయికి యిన్ని పాలో, చాయో యిచ్చి తీరిగ్గా మాట్లాడుకోండి" అంటూ అక్కడినుండి వెళ్ళిపోతుంటే "నేనొత్త" జ్యోతి పరుగెత్తింది. రాధ సావిత్రి యిద్దరు వంటింట్లోకి పోయి, పీట వాల్చి రాధమ్మను కూర్చోమంటూ సైగచేసి తాను చాయ్ చెయ్యడం మొదలు పెట్టింది.

"ఆ చెప్పమ్మా ఏమన్నుందా లేదా" అంటూ కాగే పాలల్లోనే టీ పొడి వేస్తూ అడిగింది.

రాధ మాట్లాడలేదు. కానీ కళ్ళల్లో ఏదో కొత్తకాంతి.

అది గమనించిన సావిత్రి పొయ్యిలో కట్టెలను కదిలిస్తు" ఎన్నేళ్లాయే కాక"

మూడు వేళ్ళను చూపించింది మౌనంగానే.

"మరి మాకు ఉత్తరమన్నా రాయలేదు"

"నేనే రావాలనుకున్న కాబట్టి"

" మామయ్య అత్తయ్యతో అంటూవుంటే విన్న"

"ఏమని"

కాగిన చాయ్‌ని స్టీల్ గ్లాసుల్లో వడపోస్తు "అమ్మాయి దీపారాధన చేయడానికి దేవుని దగ్గర్కి పోయింద"ని ఓ గ్లాసును రాధకు అందిస్తూ తానూ ఓగ్లాసును తీసుకుంటు అంది.

రాధ మౌనంగా టీ వైపు చూస్తుంది.

సావిత్రి ఖాళీ గ్లాసు వేడిని తప్పించుకోవడానికి తన కొంగును గ్లాసు కింద వుంచింది.

"తాగవు"

"ఎందుకో వదినా, ఏది యిష్టం వుండదు"

"మొదట్లో అలాగే వుంటుందిలే కానీ ఐదారు నెలలప్పుడు టీ తప్పక తాగాలి"

"అలాగే అన్నట్టు చూసింది రాధమ్మ"

సావిత్రి దేవుని దగ్గరకి పోయినవట గద, అనే సరికి వొళ్ళు జలదరించినట్లైంది.

"ఏమిటాలోచిస్తున్నావ్" రాధ దగ్గరినుండి ఖాళీ గ్లాసును అందుకుంటు ఏమి లేదన్నట్టు మౌనంగా పెదవిని కదిపి తలను అడ్డంగా తిప్పింది.

"అయ్యో యిట్లయితే ఎట్లా చాలా ఉషారుగ వుండాలి. ఆడదానికి తల్లి కావడమంటే ఎంత యిదనుకున్నావ్ బతుకు పండినట్టేసుమా!" అంటూ లేచి యిద్దరు

వసారాలోకి వొచ్చారు.

"నాయినా, అన్నయ్యలు లేరు?"

"కొత్త బావి దగ్గర కరెంటు మోటారు పెడుతున్నా రట. అక్కడే వున్నారు"

"అవును- సీతయ్య పెదనాయిన బాగుండా- చాలా మంచోడు" అవునన్నట్టు చూసింది.

"మరి మా పాండన్నయ్య"

మౌనంగా నవ్వినా, పెదాలు సాగి, బుగ్గలు కదిలి కళ్ళు మెరిసాయి.

"పోయిన సారొచ్చినపుడు మంచోడు కాదని గోల చేస్తివే"

మాట్లాడలేదు.

"పా అన్నయ్య ఓహో మొన్నది చేస్త, యిది చేస్త అని వూసాలు దువ్వె"

"అప్పుడాయన ప్రవర్తన అట్ల వుండె".

"చూడు రాధ- సంసారంలో సమస్యలు ఎన్నో వస్తా పోతుంటవి. మనం ఎన్నిటినో మరచిపోవాలి. అంతేగానీ, ప్రతి దాన్ని పట్టింపుగా తీసుకుంటే కుదరదు. నీకు పిల్లలు కావటం లేదు. వొదిలిపెడతం అన్నట్టుగా కూడ మాకు తెలిసింది. అయినా మామయ్యగానీ, అత్తమ్మగానీ మా అత్తగార్ని వల్లెత్తు మాట అనలేదు."

ఇలాగే రకరకాల ముచ్చట్లలో రెండు రోజులు గడిచినాయి. మూడవ రోజు అందరూ ఏవేవో పనుల్లో మునిగిపోయారు. ఇల్లంతా శుభ్రంగా అలికి ముగ్గులు పెట్టారు.

"వొదినా"

"వంటింట్లో వుంది" అనసూయమ్మ.

"ఏం చేస్తుంది?"

"పిండొంటలు. ఏం కావాలమ్మా" అంటూ వసారాలోని బల్లపీట దగ్గర కొచ్చి, చేతిలోని బెల్లపు ముద్దను పరిశీలనగా చూసి, ఆ చీమలు పట్టిన బెల్లపు ముద్దను ఎండలో పెట్టింది. ఎండ వేడికి చీమలు వచ్చిపోయి, బెల్లం నుండి వేరై కింద పడిపోయినవి.

"అ ఏం లేదు. బయటి నుండి వొచ్చేసరికి ఎవ్వరి జాడ కనిపించకపోయె" రాధ కూర్చున్న బల్లపీట వైపు మళ్ళి-

"మా చిన్నాయనోళ్ళింటికి, మా మేనత్తోళ్ళింటికి పోతివా?"

"అందరింటికి పోయిన. ఎక్కడికి పోయినా వొక్కటే గోల."

"ఏం గోల?"

"కాకి గోల. అత్తమ్మైతే మరీనూ" అంటూ పీట పక్క గోడకు జరిగి కూర్చుంది.

"ఏమందే" బెల్లపు ముద్దను చేతిలోకి తీసుకుంటు.

"అప్పుడే ఆమెకెవరు చెప్పిండే?"

"ఎన్నో నెల, ఎన్నాళ్ళకు నీళ్ళు పోసుకుంటివే." కడుపు దువ్వి చూస్తుంది నా కోపమొచ్చింది."

"నిన్న నేనే చెప్పిన."

"కోపమెందుకు? ఏదో పెద్దావిడాయె. మా నాయన గార్కి అక్కాయె. మేనకోడలయితవి, సంబరపడి



గంప కూలి

నఖచిత్రం: కాశీపట్నపు కృష్ణారావు, మురపాక

వుంటుంది."

"అదట్ల పోని. నీ కొడుకులు అందరూ పెద్దోళ్లైరి, నీయాడు సరిపోను కొడుకుంటే, నిన్ను వేరే పోనిద్దునా! నాయింటి ముందే వుండేదానివి" అంది.

"అట్లనా". అంటూ చిన్నగా నవ్వింది తల్లి.

"గ్లాసుడు పాలు యిచ్చి ఒక్కటే సోదంటే సోది, దెబ్బకే లేసొచ్చిన."

"కోడండ్లు లేరు?"

"ఉన్నారు, పోగానే కాస్త మాట్లాడి వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటున్నారు. ఈవిడ నన్ను దొలటం లేదు."

"గంట తర్వాత అందరు వొస్తరట."

"రానీ, రమ్మని నిన్ననే చెప్పొస్తిగద."

"జ్యోతి ఏదే?"

"నిద్ర పోతుంది."

"అమ్మా!"

"ఆ!"

"నేను అత్తయ్యోవాళ్ళ యింటినుండి వొస్తుంటే మైసమ్మ గుడి వుందిగద, ఆ గుడి ముందట వెట్టుకింద చాలామంది కూర్చున్నారు. ఎవరో ఒకామె చేసిందట ఎర్రగా కాల్చిన గడ్డ పారను రెండు చేతులతో దుయ్య మంటున్నారు."

"వుండొచ్చు. రెండు మూడు రోజులైంది. ఆ పంచాయతి మసలపట్టి మా నాయన గూడ అక్కడే వుండొచ్చు."

"వుండొచ్చు ఏంది. ఉన్నడు- ఆయనేమీ మాట్లా డటం లేదు. వేరేవాళ్ళే ఒకరి మీద ఒకరు పడి మాట్లాడుతున్నారు."

"నాకు తెలియక అడుగుతున్నా- వాళ్ళు పిచ్చిగానీ, కాలే గడ్డపారను ఎవరు పట్టుకున్నా కాలుద్ది అమ్మా."

"తప్పయి చేస్తేనే కాలుతది. తప్పు చేయకుంటే ఎందుకు కాలుతది?"

"నాయన చెప్పిండా?"

"నాయన చెప్పేదేంది. ఎప్పటి నుండో వొస్తున్న పద్ధతి యిది. లేకుంటే మరి ఆమె, అదే తప్పు చేసినామే, పక్కింటోనెమ్మటి పోయిందట. అది మొగనికి తెలిసింది. అదేమో 'కాదు నాకూ, అనికి ఏం సంబంధం లేదు' అంటుందట. 'వుంది' అని మొగ డంటు న్నడు."

"అయితే ఏంది?"

"ఏం లేదు. ఏదో ఒకటి తేలడానికి ఆ గడ్డపార దుయ్యడం."

"ఇదైతే తప్పు. కాలే గడ్డపారను ఎవ్వరు తాకినా కాలుతుంది. తప్పుకు, దానికి ఏం సంబంధం లేదు."

"మరి ఆనాడు సీత అగ్నిలో దూకి తాను తప్పు చేయలేదని రుజువు చేయలే."

"చేసింది. ఆమె నిప్పుల్లో దూకగానే భూమి బద్దలై, భూదేవి ప్రత్యక్షమై- 'బిడ్డా నీకు ఎన్ని కష్టాలొచ్చే' అని గూడ అనలే."

అంతలోనె తండ్రి రామయ్య కండవాను సవరించు కుంటు లోనికొస్తూ "ఏంద్రా తల్లి బిడ్డలు ఏమో తర్కించుకుంటున్నారు."

"అదే యియ్యాల్ల మీరు జరిపే పంచాయతి గూర్చి తప్పు చేసినా, చేయకున్నా కాలే గడ్డపారను తాకితే కాలు తుందట్టున్న నాన్నా" తల్లివైపు చూస్తూ రాధ.

"నిప్పు కాలకుంటే ఎలా వుంటుందమ్మా. చెపితే ఏంటేనా! దాని మామ అయితే మరీ! పోలీసుల కెళ్ళ తెస్తింటో- వొచ్చి దాన్ని, వాన్ని, వాని తండ్రిని- అందర్ని తిసుకపోయిండ్రు డు."

వాళ్ళు కేసు పెడితే కోర్టు చుట్టు తిరిగితే అప్పుడు బుద్దొస్తది."

"తిరగని మస్తి అనుగుద్ది. అవును, అన్నయ్య యింకా రాలేదా?"

"రాలేదు. ఆయన వున్నారో లేదో, సాయంత్రం యిద్దరం కలిసి పోదాం అంటే వున్నాడో, మామయ్య. రారు: మామయ్య రావాలంటే ఈయన ఇంటి దగ్గ రుండాలి."

"ఆ చీర గూడ వొస్తడో రాడో- ఎన్నడు పిలిస్తే సక్కంగ వచ్చిండని" అంటూ అనసూయమ్మ లోపలికి నడిచింది.

"ఆ చీర నీకు నచ్చింది గదమ్మా. మిగతావి వాపసు ఇచ్చి అలాగే ఆ దర్జీవాని దగ్గర కెళ్ళొస్త" అంటూ రామయ్య వాకిలు బయటికి నడిచాడు.

"రామయ్య రాధమ్మొచ్చిందట- వుందా లోపల" అంటూ రామయ్య.

చిన్నాయన భార్య ఎదురుగా వొచ్చింది, కర్ర సహాయంతో మెల్ల మెల్లగ అడుగులేస్తూ.

"ఆ వొచ్చింది- మాట్లాడు పో" అంటూ వెళ్ళిపోయాడు. ముసలమ్మ లోపలికొచ్చి రాధ పక్కనే కూర్చుంటు "అమ్మా రాధి" అంది క్రను గోడ కానిస్తూ.

"చెప్పు తల్లి! యిందాక నీ బిడ్డతోటి వొగ్లొచ్చినా యిక తమరు" అని చిన్నగా గొనిగి-

"ఆ! ఏంది నాయనమ్మా, బాగున్నావా?"

"బాగానే వున్నా" ఆవిడకు చెవులు వినపడని సంగతి తెలుసుకాబట్టి గట్టిగా అంది.

"నువ్వే చెడిపోయినవట గద, అవ్వ!"

రాధకు ఒక్కసారే పాములు, జెర్రులు పాకినట్టనిపించింది. నా ప్రాణం మీదికొచ్చింది. ఎక్కడినుండొచ్చి నవే తల్లి అని అనుకుంటూ లేవబోయింది.

"కూకో-కూకో" అంటూ రెక్కపట్టి లాగి కూర్చోపెట్టి-

"తప్పకుండా నాలాంటి బిడ్డ పుడతది లే" అంటూ తన్మయత్వాన్ని ప్రదర్శించింది.

"ఏందే అమ్మమ్మ, ఏమో అంటున్నావ్" తాంబాళంలో తెచ్చిన పిండినీళ్ళను కుడితి తొట్టెలో పోస్తూ అడిగింది.

"ఏందో వొదిన ఏమో చెడిపోయినవ్. అది యిది అంటుంది ముసలమ్మ."

"మరి నీళ్ళు పోసుకున్నంక చెడిపోకుంటే అట్లనే బొమ్మలాగుంటదా! సండ్లు జారవు రేపు."

"అమ్మా నీకో దండం- యిగ ఆపు" అంటూ లోపలికి వెడుతున్న వొదినను సమీపించి, ఆమె కొంగును ముడివేస్తూ వెట వెంట నడుస్తూ-

"నీవు, అమ్మా కలిసి వూరంతా చెప్పకపోయిండ్రా" అంది.

"కొంచెం ఆగు. ఈ కాస్తపని తీరినంక చెప్తాస్తం. ఎట్టున్న పేరంటానికి పిలిచేటప్పటికి అందర్కి చెప్పేదే కద. అయినా యిదేం సిగ్గమ్మా, తల్లివైనందుకు సంతోష పడాలిగానీ" ఆమె వంటింట్లోకి పోయింది.

రాధ మెట్లెక్కి మిద్దె మీదికి వెళ్ళి నిలుచుని, వూరునంతా కలియ చూసింది. తను చదువుకున్న బడి, ఆడుకునే చింతచెట్లు, యశోద వాళ్ల యిల్లు అన్నిటిని వరసగా చూస్తూ తన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకొని కొన్ని గడియలు ఆనందంతో మునిగి తేలింది. కనుకొలుకులు తడైనవి.

"ఛీ! ఆడపిల్ల జీవితం ఏంది. యిష్టమున్నంత చదవనీయరు. ఇష్టమున్నవాన్ని చేసుకోనివ్వరు. భర్త వాళ్ల కుటుంబం వాళ్ళతో తప్ప వేరేవాళ్ళతో మాట్లా డొద్దు. పోగా భార్యని పెట్టుకొని గూడా మరో స్త్రీ కోసం తిరగటం, వొళ్ళు తూలే వరకు తాగి వొచ్చినా సేవలు చేసి పడుకోబెట్టాలి,

పిల్లల కనాలి, పెంచాలి, పెద్ద చేయాలి, పిల్లలు కాకుంటే ఆడదాని లోపమే" అనుకుంటూనే రాధ కళ్ళు తిరిగేసరికి, కూర్చోని కళ్ల మూసుకుంది.

ఒక్కసారే చెమటలు పోసి మనిషి కుప్పకూలినట్లై కొన్ని క్షణాల తర్వాత తేరుకుంది.

తనకు పిల్లలు కాలేరు.

దీపారాధన చేసి రమ్మన్నారు మామయ్య. ఆయన గారు రాలేదు. రంగడు గోదానం చేయించి వొచ్చాడు.

తాను గుండంలో మునిగింది. స్తంభం ముందు పొర్లుతూ దండాలు పెట్టింది.

"అందుకే గర్భవతి అయ్యింది" అంటాడు మామయ్య.

"దీపారాధన చేస్తే తప్పక పిల్లలు పుడతారు" వూరి జనం, మరి చాకలి మంగి!?


సైకిల్ మోటారు శబ్దం అయ్యి, ఆగినట్టనిపిస్తే, కిందికి దిగి వొచ్చి బయటి దర్వాజ వైపు నడిచింది.

13

బస్సు దిగి రాధ తనకోసం సిద్ధంగా వున్న కచ్చడంలో కూర్చుంది. కచ్చడం వూరి తోవ పట్టింది. రంగడు ఈలపాట పాడుతున్నాడు.

"ఏంరా చాలా వుశారుగా వున్నావు ఈ రోజు" గాలికి చెదిరే వెంట్రుకలను సవరించుకుంటూ అంది.

"నేను చెప్పలేదమ్మగారు తిరునాలకు పోతే తప్పక—" అంటూ మళ్ళీ ఈలపాటలో పడ్డాడు.




రాధ జాలిగా నవ్వి కళ్ళు మూసుకుని మెత్తకు వొరిగింది.

జాతర్లో జరిగిన సంఘటనలు గుర్తుకు రాసాగినవి.

ఆ రోజు గుట్టమీద అన్ని కార్యక్రమాలు అయినాక అందరితోపాటు దిగడానికి ప్రయత్నిస్తున్న రాధను ఆగమని సైగచేసాడు పూజారి.

"హరికథ అయిపోయిందిగద, యిక నేను వెడతా నండి పూజారిగారు."

"వెలుదువు గానీ ఉండమ్మా! నేనూ కిందికి వొస్తగా. గుళ్లోకెళ్లి కొబ్బెరకాయ పట్టుకొస్త" అంటూ గుళ్లో కెళ్ళాడు. అందరూ సద్దుమణిగారు. కొద్దిసేపట్లో పూజారి పూలదండతో, కొబ్బెరికాయతో వొచ్చాడు.

"పద గుట్ట దిగుదాం. మా జీతగాడు బండి దగ్గర వున్నాడో, లేకపోతే వూరేగపోయాడో" అంటూ మెట్ల వైపు నడిచాడు. తానూ అతన్ని అనుసరించింది. కొన్ని మెట్లు దిగినాక పూజారి ఆగి —

"ఈ పూలు తల్లో పెట్టుకో" అంటూ యిచ్చాడు. అతను తెచ్చిన దండ తాను తీసుకొని తల్లో పెట్టుకుంది.

ఒక్కసారే పూజారి తనను ఎగాదిగా చూసి— "నీకు తప్పక కొడుకు పుడతాడు" అన్నప్పుడు తాను నవ్వింది. అతనూ నవ్వాడు.

మళ్ళీ నడక సాగిస్తూ అప్పటి వరకు తన నడుముకు ఉన్న ఉత్తరీయాన్ని విప్పి భుజాన వేసుకున్నాడు. అప్పటి వరకు అర్ధనగ్నంగా వున్న అతని ఒంటిపై ఉత్తరీయం హుందాగానే వుంది. పూజార్లు ఒక్క పట్టుధోతి మాత్రమే కట్టుకొని, మిగతా ఎద భాగాన్ని వొదిలేస్తారు. అప్పుడు వాళ్ల వయస్సు, అందం, ఆరోగ్యాన్ని అన్నీ తెలుసుకోవచ్చు.

చేతిలో కొబ్బెరికాయ అలాగే వుంది. నడుస్తూ నడుస్తూ ఆగి, మసక మసక వెన్నెల్లో కనిపించే గుడిని, గుట్టని, గుట్ట చుట్టు బండల మీద పడుకున్న జనాన్ని చూపించాడు. గుట్ట చుట్టూరా ఎన్నో చూడలేని దృశ్యాలు. ఎందరో జంటలు సరసాలు ఆడుకుంటు న్నారు. తన భర్త గుర్తొచ్చి మనస్సు పిచుక్కుమంది. సరిగ్గా అప్పుడే ఘూశాడు పూజారి తన ముఖంలోకి.

"ఏమీ మీవారు గుర్తొచ్చారా?" అని అన్నప్పుడు ఎంత సిగ్గు అనిపించింది. పూజారి చూపించిన మరో దృశ్యం—ఒహ్! ఎంత బైరంగంగా— "యిది పూర్వం నుండి వొస్తున్నదే" అంటూ, యిందాక హరికథలో చెప్పిన శ్రీకృష్ణుని చేష్టలు గుర్తుచేశాడు.

ఇలా ఈ బండ మీద కుర్చుందామా, కాళ్ల లాగుతున్నాయి అన్నప్పుడే అనుకున్నా కాని, పూజారి కదా అని నమ్మాను.

కూర్చున్నాం. అతని చేతిలో కొబ్బెరికాయ అలాగే వుంది. గుడిలో దేవుని దగ్గర పూజకు కూర్చున్నట్టు నా

ఎదురుగా పూజారి.

"మీ కిష్టమైతే మన్మధపూజ చేస్తాను. అందుకే ఓ కొబ్బెరకాయ తెచ్చాను."

"అంటే" కొంచెం తికమక పెందుతూ అంది.

"ఏం లేదు. మంత్రాలు చదివి మన్మధుడ్ని రప్పిస్తాను. అప్పుడు మన్మధునితో నీవు మాట్లాడొచ్చు"

"అదెట్లా సాధ్యం?"

"సాధ్యమే. ముప్పై ఏళ్ల నుండి నేనే పూజారి పని చేస్తున్నాను. ఇరవై ఏళ్ల వయసులో ఈ గుట్ట మీద కొచ్చాను. ఎంతోమందికి మన్మధ పూజ చేసాను" అంటూ ధీమాగా చెప్పాడు.

నమ్మాలా, వద్దా అని ఆలోచిస్తున్నాను.

"మాడు—దేవుని దగ్గర కొచ్చాక దేవుని మీద భారమెయ్యాలి" అంటూ అతను తెచ్చిన కొబ్బెరికాయను తన దోసెటిలో వుంచాడు.

"కళ్ళు మూసుకొండి. నేను చెప్పినట్టు చెయ్యండి, అడిగిన ప్రశ్నలకు జవాబు యివ్వండి, కళ్ళు తెరిచావో వ్రతభంగమౌద్ది—పిల్లలు కారు"

సరేనని కళ్ళుమూసుకున్నాను. దోసిట్లో కొబ్బెరికాయ.

"మన్మధుడు చాలా అందగాడు, ఎత్తైన విగ్రహం. అందమైన ముఖ వర్చస్సు, కోరికలను రేకెత్తించే చూపులు. వస్తున్నాడు! నీ దగ్గరికి వస్తున్నాడు!! వచ్చి నీ ముందు నిలిచి నవ్వుతున్నాడు, కవ్విస్తున్నాడు. ఆ కళ్ల నిండా అతని రూపమే— అవునా?" అతని ప్రశ్న.

"అవును" అనుకోకుండా జవాబు.

"నీ పక్కనే కూర్చున్నాడు"

"  ——"

"నీ వక్షస్థలాన్ని తాకుతున్నాడు"

"——తున్నాడు "

"నిన్ను, నిన్ను కౌగలించు——"

"హు"

అపుడు నాలో నేను లేను. నా పెదాలు వణక సాగాయి. శబ్దం మాయమైంది. నేను పూర్తిగా అతని స్వాధీనంలో వున్నాను.


నన్ను— నన్ను— ఓహ్! ఎంత సేపు అలా— నాకు గుర్తు లేదు— కళ్లు తెరిచ్చే సరికి పూజారి—

నా చేతిలోని కొబ్బెరికాయ ఎప్పుడు జారిపోయిందో అది కొద్ది దూరంలో వుంది. దాన్ని తీసుకొని చుట్టూ తిరిగి దండం పెట్టి నేలమీద కొట్టాడు. అది రెండుగా పగిలిపోగా, అందులోనుండి నీళ్లు చల్లాడు. నా ముఖం మీద ఆ నీరు పడగానే నేనిలోకంలోకి వొచ్చి, చెదిరిన చీరను సరిచేసు కొని, దబాదబా మెట్లు దిగి వచ్చాను. నా వెంటనే వస్తున్న పూజారి నేను కచ్చడాన్ని చేరగానే తాను వెనక్కి మళ్లిపోయాడు.

ఒక మనిషి అవసరం మీద మరో మనిషి ఎప్పుడు వాల విసురుతూనే వున్నాడు.

రంగడు కచ్చడం దగ్గర లేడు.

"అవును. నేను కచ్చడం దగ్గర కొచ్చేసరికి నీవు కచ్చడం దగ్గర లేవేమి రంగ" గతంలో నుండి తేరుకొని సరిగా కూర్చుంటూ.




"నేను బాగోతులు ఆడుతుంటే అక్కడ కూర్చున్న. ఆ ఆట తెల్లారిందాక నడిచింది. గుట్టమీద కూడా తెల్లా రిందాక చెపుతారేమో అప్పటి వరకు వొచ్చి మిమ్ములను తీసుకురావచ్చు అనుకున్న."

"అనుకుని"

"గోరుకోల్లు పాడవంగ వొచ్చి సూద్దునుగదా తమ రొచ్చి నిద్రపోతుండ్రు. నేను అట్ట గడ్ల అడ్డం వొరిగిన"

ఆ తర్వాత నాకు మెలకువ వొచ్చింది. లేచి చూస్తే నీవు బాగా నిద్రలో వున్నావు. నీ చేతికి తాయిత వుంది.

రంగడు దండ రెక్క వైపు చూసుకుని

"ఏదీ లేదుగ" అంటూ ఎడమ చేయితో అది లేచిపోయినాక చెదిరిన హద్దును రుద్దుతూ తనలో తను నవ్వుకొంటూ.



కాపరి

నఖచిత్రం: కాళీపట్నపు కృష్ణారావు, మురపాక

"కొయ్యదొర చెప్పింది"

"నిజమైందిర"

"ఆ.. మంత్రిచ్చి యిచ్చిందాయే!"

"అదే లేసిపోయిందంటవు"

రంగడు రాత్రి తాను తిరిగిన తిరుగుడు, ఆడిన సరసాలు గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. అందుకే రాధ మాటలు విన్నట్టు లేదు.

అయితే రాత్రి నీ కలలో ఆడది వొచ్చిందా లేక పోతే—"

వాడు కోడెల తోకలను కదిలించాడు. కచ్చడం పరుగు పెరిగింది.

"చెప్పేంరా"

"ఏం చెప్పనమ్మగారు. మంత్రాల్లో ఎంత మాయ వుంది చూడు. అన్నట్టే ఆడదాన్ని ముట్టుకుంటే లేసిపోద్దన్నడు. అట్టనే అయింది. లేకుంటే ఎన్నేండ్ల నుండి నా వొంటి మీదుండే అది..."

రాధకు నవ్వొచ్చింది.

మూఢ నమ్మకాలు మనిషిని గుడ్డివాడ్ని, ఎడ్డివాడ్ని చేస్తున్నందుకు వాటిని ప్రచారం చేసేవాళ్ల మీద కోపం వచ్చింది. రంగని వైపు జాలిగా చూస్తూ—

"రంగ! నీ చేతి తాయితను ఆరోజు తెల్లారేటప్పుడు నీకు మెలకువ వొచ్చిందన్న చూడు అప్పుడు నేనే రెక్క నుండి యిడిచిండ్ర"

"నేను నమ్మను"

"నమ్మవా — యిటు ఈ కచ్చడం కప్పువైపు చూడు. అదిగో ఆ వెదురు తడిక కింద ఆ వొంచిన వెదురుకర్ర మధ్యన చెక్కిన తీసి చూసుకో" అంటూ.

రంగడు లేచి తాయితును తీసి చూస్తు ఏం మాట్లాడ లేక కుప్ప కూలినట్టు కూర్చున్నాడు.

కచ్చడం నడుస్తూనే వుంది.

రాధకు వున్నట్టుండి చాకలి మంగి గుర్తొచ్చింది. ఆమె అన్నమాటలు గుర్తొచ్చినవి. తన పోగులు లేసిన పట్టు చీర గుర్తొచ్చింది. మంగి మాటలు జీవిత సత్యాలు! మామయ్య మాటలు మూఢనమ్మకాలు! ఒక్క మామయ్య మాటలే కాదు యింకా చుట్టూర వున్న ఎంతోమందివిగూడ—!?

కచ్చడం ఉళ్లో కొచ్చి సీతయ్య పటేలు యింటివైపు మళ్లింది.

రాధమ్మ ఆలోచనల నుండి తేరుకొని, తలనిండా కొంగును కప్పకొని సర్దుకొని కూర్చుంది.

— సమాప్తం —